www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:10 MONDAY ,MAY 18,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 10 సోమవారం 18 మే 2026 పేజీలు :8 వెల: 4/-

## మూడేళ్లలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని అడిగింది
## 85,677 కోట్లు ఇచ్చింది 28,065 కోట్లు



మే 17 ( హంసకలం వార్త )

దేశాన్ని పరిపాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2023--24 ఆర్థిక సంవత్సరం నుంచి 2026 మార్చి 31 వరకు ఈ మూడేళ్లలో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద రూ.85,677.82 కోట్లు కేంద్రాన్నిఅడిగితే ఇచ్చింది మాత్రం రూ.28,065.97 కోట్లు మాత్రమేనని కాగ్ పత్రాలు వెల్లడిస్తున్నాయి. - మిగతా2లో

## జూన్ 2 నుంచి కొత్త పెన్షన్లు: మంత్రి వివేక్ వెంకటస్వామి



మే 17 ( హంసకలం వార్త )

ఈ ఏడాది జూన్ 2వ తేదీ నుంచి కొత్త పెన్షన్లను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ హయాంలో ఒక్క పెన్షన్ కూడా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఆదివారం మిర్యాలగూడలో మంత్రి వివేక్ వెంకటస్వామి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు - మిగతా2లో

## శాంతి చర్చలు.. ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు

- యుద్ధ నష్టపరిహారం ఇవ్వబోమని స్పష్టం
- 400కిలోల యురేనియం ఇవ్వాలని డిమాండ్
- స్తంభించిన నిధుల విడుదలకు నిరాకరణ
- ఇరాన్ సైతం ఐదు షరతులు
- పరహారం ఇవ్వాల్సిందేనని పట్టు

2



## భారత్ అమ్ములపొదిలో 'ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కిల్లర్' క్షిపణి

మే 17 ( హంసకలం వార్త )


రక్షణ రంగంలో స్వయం సమృద్ధి దిశగా భారత్ మరో భారీ ముందడుగు వేసింది. శత్రు దేశాల భారీ యుద్ధ నౌకలను, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లను సైతం సముద్రంలోనే జలసమాధి చేయగల అత్యంత శక్తివంతమైన హైపర్‌సోనిక్ క్షిపణిని అభివృద్ధి చేసింది. దీనిని 'ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ కిల్లర్'గా అభివర్ణిస్తున్నారు. హిందూ మహాసముద్రంలో చైనా కదలికలకు చెక్ పెట్టేలా దీనిని రూపొందించడం - మిగతా2లో



## నీట్ లీక్ కేసులో ప్రొఫెసర్ మనీషా అరెస్ట్

మే 17 ( హంసకలం వార్త )

నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ కేసు దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) వేగవంతం చేసింది. ఈ కేసులో పుణెకు చెందిన సీనియర్ బోటనీ టీచర్ మనీషా గురునాథ్ మాంధరేను శనివారం అధికారులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో దేశంలోని వివిధ నగరాల నుంచి ఇప్పటివరకు - మిగతా2లో



## అటవీ సంపదను దోచుకుంటున్నారు.. ఆదివాసీలను వదిలేశారు




మే 17 ( హంసకలం వార్త )

భారతదేశ స్వాతంత్ర్యానికి ముందు నుంచే ఆదివాసీలు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారని పౌర హక్కుల ఉద్యమ నేత, ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఆదివాసీల చరిత్ర అంతా పోరాటమయం అని చెప్పారు. - మిగతా2లో

## ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!

మే 17 ( హంసకలం వార్త )

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని, బలమైన వడగాలులు వీచే అవకాశం ఉందని - మిగతా2లో



## బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి: కేటీఆర్

మే 17 ( హంసకలం వార్త )

పోక్సో చట్టం కింద బండి భగీరథ్ అరెస్ట్ అయిన నేపథ్యంలో ఈ కేసు నిష్పక్షపాతంగా విచారణ జరగాలంటే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని ప్రధాని మోదీని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. - మిగతా2లో



## సర్ పై కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయం చేస్తున్నాయి

మే 17 ( హంసకలం వార్త )

సర్ పై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు రాజకీయం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కరికి ఒక్క ఓటు ఒక్క దగ్గర మాత్రమే ఉండాలని చెప్పుకొచ్చారు. ప్రింటింగ్ ఎర్రర్ కారణంగా ఒక్కొక్కరి ఓటు పది ప్రాంతాల్లో చూపిస్తోందని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో కిషన్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో సర్ షెడ్యూల్ వచ్చిందని ప్రస్తావించారు. - మిగతా2లో



హంస కలం వార్త
HAMSA KALAM VARTA
సోమవారం 18 మే 2026

# మూడేళ్లలో తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని అడిగింది 85,677 కోట్లు ఇచ్చింది 28,065 కోట్లు

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రం నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలు ఇద్దరు కేంద్ర మంత్రులున్నా రాష్ట్రానికి ఒనగూడిన ప్రయోజనం ఏమి లేదని, కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో ఘోరంగా విఫలమయ్యారని కాగ్ లెక్కలే తెలియజేస్తున్నాయి. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం స్వంత ఆదాయం పైనే ఎక్కువగా ఆధారపడుతున్నది. ఖర్చులకు తగిన ఆదాయం రాకపోవడంతో అప్పులపైనే ఎక్కువగా ఆధారపడాల్సిన అనివార్య పరిస్థితి తెలంగాణ ప్రభుత్వానికి ఏర్పడింది.

2023-24 నుంచి 2026 మార్చి వరకు కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్స్ (రూ. కోట్లలో)

| సంవత్సరం | ఎస్టిమేట్ | వచ్చింది | శాతం |
|---|---|---|---|
| 2023--24 | 41,259.17 | 9729.91 | 23.58 |
| 2024--25 | 21636.15 | 7913.08 | 36.57 |
| 2025--26 | 22782.50 | 10,422.98 | 45.75 |

(కాగ్ పత్రాలు ఆధారం)

రాష్ట్ర ఆదాయాలు, ఖర్చుల మధ్య లోటు భర్తీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఇస్తుంది. ముఖ్యంగా ఉద్యోగుల వేతనాలు, పెన్షన్లు, ఆరోగ్యం, విద్య, రైతు సంక్షేమ పథకాల అమలుకు లోటును పూడ్చటానికి వీటిని ఉద్దేశిస్తుంది. అలాగే ప్రాంతీయ అసమానతలు తగ్గించడానికి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ప్రత్యేక గ్రాంట్లు కూడా ఇస్తుంది. మరో వైపు కేంద్ర ప్రభుత్వ పథకాలైన జల్ జీవన్ మిషన్, పీఎంఏవై, ఎన్‌హెచ్ఎం, విద్యా పథకాలకు సహాయం చేస్తుంది. వరదలు, కరువు, తుఫాన్లు, భూకంపాల సందర్భాల్లోనూ ప్రత్యేక గ్రాంట్లు ఇస్తుంది. ఆదివాసీ ప్రాంతాల వృద్ధి, రాష్ట్రాల ప్రత్యేక అవసరాలు, ఆర్థికంగా బలహీన రాష్ట్రాల కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 275 ప్రకారం గ్రాంట్స్ ఇస్తారు. ముఖ్యంగా ఇలా ఇచ్చే గ్రాంట్లు ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు విడుదల చేయాలి. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆర్థిక సంఘం చేసిన సిఫారసులు కేంద్రం ప్రకటించే ప్రాయోజిత పథకాలు, వాటికోసం రాష్ట్రానికి చేసిన కేటాయింపుల మేరకు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద కేంద్రం నుంచి వచ్చే ఆదాయాన్ని అంచనావేసి బడ్జెట్‌లో పొందుపరుస్తారు.

**ఆర్థిక సంఘం సిఫారసులు పట్టించుకోనికేంద్రప్రభుత్వం తెలంగాణపై కక్ష కట్టిందా?**

ఆర్థిక సంఘం సిఫారసులు కూడా పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై కక్ష కట్టిందా? అనే సందేహాలు వెలువడుతున్నాయి. చిన్నచిన్న కారణాలు చూపి కేంద్రం రాష్ట్రానికి గ్రాంట్స్ విడుదల చేయడం లేదన్నఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి ఆర్థిక సంఘం సిఫారసులతో పాటు కేంద్ర ప్రాయోజిత పథకాలు, విపత్తుల నిర్వహణ నిధి, పట్టణాభివృద్ధికి గ్రాంట్స్ రావాలి. కానీ యుటిలైజేషన్ సర్టిఫికెట్ సమయానికి ఇవ్వడం లేదన్న కారణం చూపి నిధులు విడుదల చేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాది జనవరిలోనే ఫైనాన్స్ కమిషన్ నిధులు మూడు వేల కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ కూడా రాసింది. దీనిని బట్టి పరిశీలిస్తే రాజకీయ కారణాలతోటే కేంద్రం నిధులు ఇవ్వకుండా రాష్ట్రాన్నిఇబ్బందులకు గురి చేస్తున్నదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు విడుదల చేయక పోవడంతో అప్పుల వైపు!**

కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం లోటును పూడ్చుకోవడానికి అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో స్వంత ఆదాయ వనరులు తగ్గిపోయాయి. కేంద్రం ఎంత మేరకు ఇవ్వాలో అంత మేరకు గ్రాంట్స్ ఇవ్వడం లేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన రోజు నుంచి బీజేపీ ప్రభుత్వం ఇదేరకమైన వివక్ష చూపిస్తున్నదన్న అభిప్రాయం తెలంగాణ సమాజంలో ఏర్పడింది. అందుకే కాబోలు కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టలకు కేంద్రం జాతీయ హోదా ఇవ్వలేదు. ఫలితంగా లక్ష ల కోట్ల రుణం కాళేశ్వరం ప్రాజెక్ట్ కోసం తీసుకోవాల్సి వచ్చింది.

# అటవీ సంపదను దోచుకుంటున్నారు.. ఆదివాసీలను వదిలేశారు

-మొదటిపేజీ తరువాయి

అడవులను కాపాడేందుకు వారు ఇప్పటికీ పోరాటాలు చేస్తూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. హనుమకొండలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఐక్యత సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ హరగోపాల్, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట నారాయణ, ఆదివాసీ హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు ఉపేందర్, ఆదివాసీ సంఘాల నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ.. ఆదివాసీల పట్ల పాలకులు వివక్ష చూపుతున్నారని అన్నారు. అభివృద్ధి కంటే అణచివేతనే కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి హామీలు ఇచ్చారే కానీ, పాలకులు ఏనాడూ వాటిని అమలు చేయలేదని ఆరోపించారు. అటవీ సంపదను దోచుకుపోతున్న వారే తప్ప, ఆదివాసీలకు భరోసా ఇచ్చే వారు లేకుండా పోతున్నారని చెప్పారు. ఖనిజ సంపదను తరలించుకుపోతున్నారే కానీ, అడవి బిడ్డల అభ్యున్నతిని విస్మరిస్తున్నారని హరగోపాల్ మండిపడ్డారు. పెట్టుబడి దారులకు పాలకులు కొమ్ముకాస్తున్నారని, ఆదివాసీలను అణచివేతకు గురి చేస్తున్నారని ఆగ్రహించారు. ఆదివాసీలందరూ ఎలాంటి స్వార్థం లేని వారని, అందుకే అడవులు అంతరించిపోకుండా కాపాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి ఆదివాసీలు అందరూ సంఘటితమై పాలకులను నిలదీయాలని ప్రొఫెసర్ హరగోపాల్ పిలుపునిచ్చారు.

# ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!

-మొదటిపేజీ తరువాయి

ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ ఆరు రోజుల్లో వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. దీనివల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్‌ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరం.

# బండి సంజయ్‌ను కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలి: కేటీఆర్

-మొదటిపేజీ తరువాయి

ఆదివారం ఎల్ బీ నగర్‌లో నిర్వహించిన 'నా బూత్.. నా భవిష్యత్తు' కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. ప్రధాని మోదీ 'బేటీ పడావో.. బేటీ బచావో' అంటున్నారన్నారు. కేవలం ఇది నినాదాలకే పరిమితమైతే న్యాయం జరగదని పేర్కొన్నారు. భారతదేశంలో మొట్టమొదటిసారి కేంద్రమంత్రి కుమారుడి మీద లుకౌట్ నోటీస్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని చెప్పారు. బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయకపోతే ఈ కేసు విచారణ సజావుగా జరిగే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తప్పు చేసిన కొడుకుని తొమ్మిది రోజులు దాచి పెట్టారంటూ కేంద్రమంత్రి సంజయ్‌పై ఆయన నిప్పులు చెరిగారు. సంజయ్ లాంటి వ్యక్తి పదవిలో కొనసాగడం తెలంగాణకే కాదు.. భారతదేశానికి కూడా అవమానకరమన్నారు. కేంద్ర మంత్రి కొడుకు మైనర్ బాలికకు అన్యాయం చేశాడని విమర్శించారు. మైనర్ బాలిక తల్లిదండ్రుల్ని స్వయాన కేంద్ర మంత్రి భయభ్రాంతులకు గురిచేశారని గుర్తు చేశారు. ఈ కేసును నీరుగార్చే ప్రయత్నం చేసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ఆరోపించారు. హనీ ట్రాప్ అని, మీడియాను మనీ ట్రాప్‌లో వేసి.. సీఎం రేవంత్, కేంద్ర మంత్రి బండి సంజయ్.. ఇద్దరూ మీడియాలో వార్తలు రానీవ్వకుండా చేశారని మండిపడ్డారు. కేంద్ర మంత్రి పదవి నుంచి సంజయ్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలా చేయకుంటే తన మీద అఘాయిత్యం జరిగినా ముందుకు వచ్చే ధైర్యం ఏ ఆడబిడ్డ చేయదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే బండి సంజయ్‌ను కేంద్రమంత్రి పదవి నుంచి తొలగించి.. ఈ కేసు విచారణను నిష్పక్షపాతంగా జరిపించాలని కేంద్రానికి ఆయన స్పష్టం చేశారు. కేంద్రమంత్రి ఎన్ని రకాలుగా బెదిరింపులు, ఒత్తిళ్లు తెచ్చినా బాధిత బాలికకు తల్లి అండగా నిలబడిందన్నారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి ఇద్దరూ కుమ్మక్కై ఆ అమ్మాయికి అన్యాయం చేయాలనుకున్నా.. ఆ తల్లిదండ్రులు వెనకడుగు వేయలేదని తెలిపారు. బాలిక తరపున పోరాటం చేసిన బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగానికి ఈ సందర్భంగా కేటీఆర్ అభినందనలు తెలియజేశారు. బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కూడా ఈ కేసులో చాలా గట్టిగా కొట్లాడారని గుర్తు చేశారు. బండి భగీరథ్ లొంగిపోయాడు, అరెస్టయ్యాడంటూ డ్రామా నడుస్తున్నదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు.

# సర్ పై కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయం చేస్తున్నాయి

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని తాము తప్పుపట్టడం లేదని అన్నారు. ఓటర్ లిస్టు సరిదిద్దడంలో అందరి బాధ్యత ఉందని తెలిపారు. ఒక్కో పోలింగ్ బూత్ లెవెల్ ఆఫీసర్ ఒక్కో ఇంటికి మూడుసార్లు వెళ్తారని చెప్పారు. రేవంత్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులపై నమ్మకం లేదని కిషన్‌రెడ్డి అన్నారు. ముస్లింల మీటింగ్‌కి వెళ్లి.. మీరంతా ముందుకు రావాలని సీఎంగా ఉండి రేవంత్‌రెడ్డి రెచ్చగొడు తున్నారని విమర్శించారు. సర్ చేసేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులేనని.. బీజేపీ కార్యకర్తలు కాదని స్పష్టం చేశారు. సర్‌లో కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ నేతలు ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. సర్‌లో ఎక్కడ కుట్ర జరుగుతుందో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు చెప్పాలని నిలదీశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ బాధ్యతారహితంగా మాట్లాడుతున్నాయని ఆగ్రహించారు. కేరళం, తమిళనాడులో బీజేపీ గెలవలేదు కాబట్టి అక్కడ సర్ బాగా జరిగిందని అంటున్నారని తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో బీజేపీ గెలిచింది కాబట్టి అక్కడ సర్ తప్పు జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోలింగ్ కేంద్రాలకు వెళ్లాలని... ఎలక్షన్ కమిషన్‌పై బురద జల్లవద్దని కిషన్‌రెడ్డి హితవు పలికారు. సర్ కాంగ్రెస్ హయాంలో కూడా జరిగిందని ప్రస్తావించారు. రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు ఉంటే... ఒక్కొక్కరిని వెతికి తొలగించాలని ఉద్యోగులకు విజ్ఞప్తి చేశారు. విదేశీయులను తొలగిస్తే రాహుల్‌గాంధీకి వచ్చిన నొప్పేంటని ప్రశ్నించారు. పశ్చిమబెంగాల్‌లో సర్ జరిగినప్పుడు రాష్ట్ర ప్రభుత్వ సిబ్బంది ఉందని.. కేంద్ర సిబ్బంది కాదని తేల్చిచెప్పారు. టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్థాయికి తాను దిగజారనని అన్నారు. బీఆర్ఎస్ మీద కాంగ్రెస్ దొంగ ఓట్లతో గెలిచిందా..? అని ప్రశ్నించారు మాజీమంత్రి కేటీఆర్ రెండుసార్లు గెలిచి మంత్రి అయితే అప్పుడు ఎలక్ట్రానిక్ మిషన్ మంచిదా..? అని నిలదీశారు. ప్రజలు చాలా తెలివైనవాళ్లని చెప్పారు.

## జూన్ 2 నుంచి కొత్త పెన్షన్లు: మంత్రి వివేక్ వెంకటస్వామి

-మొదటిపేజీ తరువాయి

కోడి రెక్క శౌరి అంత్యక్రియలో పాల్గొని నివాళులు అర్పించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

**అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తాం..**

ధాన్యం కొనుగోలులో తమ ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లను సకాలంలో అందించి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నామని చెప్పుకొచ్చారు. మిర్యాలగూడ, నకిరేకల్‌లలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని.. ఇందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల రక్షణ కోసం ఆయా ఫ్యాక్టరీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఫార్మారంగంలో ప్రమాదాల నివారణకు నూతన విధివిధానాల ఏర్పాట్లకు తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## శాంతి చర్చలు.. ఇరాన్ ముందు అమెరికా ఐదు కఠిన షరతులు

-మొదటిపేజీ తరువాయి

ఇరాన్‌తో జరుగుతున్న శాంతి చర్చల్లో అమెరికా ఐదు కఠిన షరతులు విధించింది. ఇప్పటి వరకు ఇరాన్‌కు జరిగిన నష్టాలకు ఎలాంటి పరిహారం చెల్లించే ప్రసక్తి లేదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ ఓ నివేదికను విడుదల చేసింది. ఇరాన్ తన వద్ద ఉన్న 400 కిలోల శుద్ధిచేసిన యురేనియంను తమకు అప్పగించాలని అమెరికా డిమాండ్ చేసింది. అలాగే ఇరాన్‌లోని అణు కేంద్రాల్లో కేవలం ఒక్కదానికి మాత్రమే అనుమతి ఇస్తామని పేర్కొంది. విదేశాల్లో స్తంభించిపోయిన ఇరాన్ ఆస్తుల్లో కనీసం 25 శాతాన్ని కూడా విడుదల చేయబోమని తెలిపింది. వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న ఘర్షణల ముగింపు ఈ చర్చల పురోగతిపైనే ఆధారపడి ఉంటుందని అమెరికా లింక్ పెట్టింది. ఈ ఐదు షరతులకు ఇరాన్ అంగీకరించినా అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ముప్పు అలాగే కొనసాగుతుందని వైనెట్ న్యూస్ అభిప్రాయపడింది. మరోవైపు ఇరాన్ కూడా చర్చల కోసం ఐదు షరతులను విధించింది. ముఖ్యంగా లెబనాన్‌లో ఘర్షణలు ఆపాలని, తమపై ఆంక్షలు ఎత్తివేయాలని, స్తంభించిన నిధులను విడుదల చేయాలని కోరింది. యుద్ధ నష్టపరిహారంతో పాటు హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించాలని డిమాండ్ చేసింది.

## భారత్ అమ్ములపొదిలో 'ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్ కిల్లర్' క్షిపణి

-మొదటిపేజీ తరువాయి

రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఈ లాంగ్ రేంజ్ యాంటీ-షిప్ హైపర్‌సోనిక్ మిస్సైల్ (ఎల్ఆర్-ఏఎస్ హెచ్ఎం)ను దేశీయంగా అభివృద్ధి చేసింది. ఇది సుమారు 1,500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. గంటకు దాదాపు 12,000 కిలోమీటర్ల (మాక్ 8 నుంచి 10) అసాధారణ వేగంతో ప్రయాణించడం దీని అతిపెద్ద బలం. ఈ వేగం కారణంగా శత్రువుల ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు దీనిని గుర్తించి అడ్డుకోవడం దాదాపు అసాధ్యం. ఒక వేళ రాడార్ పై కనిపించినా, శత్రు దేశాలు స్పందించేలోపే లక్ష్యాన్ని ఛేదించగల సామర్థ్యం ఆ మిస్సైల్ సొంతం. ఇది 1500 కిలోమీటర్ల దూరాన్ని కేవలం 7 నిమిషాల 30 సెకన్లలోనే చేరుకుంటుంది అంటే దీని సత్తా ఏంటో అర్థమవుతుంది. చైనా నిర్మించిన అత్యాధునిక 'ఫ్యుజియాన్' విమాన వాహక నౌకను కూడా ఇది నిమిషాల్లో ధ్వంసం చేయగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఈ క్షిపణి, భారత నౌకాదళంతో యూజర్ ట్రయల్స్‌కు సిద్ధమవుతోంది. ఇటీవల ఒడిశా తీరంలో జరిపిన పరీక్షలు విజయవంతమయ్యాయి. 2027-28 మధ్యలో తుది ట్రయల్స్ ప్రారంభించి, 2029-30 నాటికి పూర్తిస్థాయిలో నౌకాదళంలోకి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యంలో భాగంగా రూపుదిద్దుకున్న ఈ ప్రాజెక్టు ఓ కీలక మైలురాయిగా నిలవనుంది. ఈ క్షిపణి వ్యవస్థ అందుబాటులోకి వస్తే హిందూ మహాసముద్రంలో భారత భద్రతా సామర్థ్యం, నిరోధక శక్తి కొత్త శిఖరాలకు చేరుకుంటాయి. సముద్ర తీర ప్రాంత రక్షణ మరింత పటిష్ఠం కానుంది.


## నీట్ లీక్ కేసులో ప్రొఫెసర్ మనీషా అరెస్ట్

-మొదటిపేజీ తరువాయి

మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. మనీషా మాంధరే పుణె శివాజీనగర్‌లోని 'మోడ్రన్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్'లో పనిచేస్తున్నారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)లో సబ్జెక్ట్ నిపుణురాలిగా ఉన్నందున ఆమెకు బోటనీ, జువాలజీ ప్రశ్నపత్రాలను చూసే అవకాశం లభించింది. ఈ క్రమంలోనే మే 3న జరిగిన పరీక్షకు ముందే ఆమె ప్రశ్నలను లీక్ చేశారని సీబీఐ ఆరోపించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆమె మరో నిందితురాలు మనీషా వాఘ్మారే సహాయంతో కొంతమంది నీట్ అభ్యర్థులను ఎంపిక చేశారు. పుణెలోని తన ఇంట్లోనే విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ తరగతులు నిర్వహించారు. ఆ సమయంలో ముఖ్యమైన ప్రశ్నలను నోట్‌బుక్స్‌లో రాయించి, టెక్స్ట్‌బుక్స్‌లో మార్క్ చేయించినట్లు దర్యాప్తులో తేలింది. ఆ ప్రత్యేక తరగతుల్లో చెప్పిన ప్రశ్నల్లో చాలావరకు నీట్ బయాలజీ పరీక్ష పేపర్‌తో సరిపోలాయి. ఈ వ్యవహారంలో ఎన్‌టీఏ అంతర్గత వ్యక్తులు, మధ్యవర్తులు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసి ప్రశ్నలను చేరవేసినట్లు ఏజెన్సీ అనుమానిస్తోంది. కేంద్ర విద్యాశాఖ ఫిర్యాదు మేరకు మే 12న సీబీఐ ఈ కేసును నమోదు చేసింది.

# సంపాదకీయం

## ఆ స్వాతంత్ర్య యోధులు బానిసలయ్యారు



ఆధునిక ప్రపంచంలో అతిపెద్ద ఒప్పంద కార్మిక వలసలు భారతదేశం నుంచే జరిగాయి. 1870--1930 మధ్య కాలంలో విదేశాలకు వలస వెళ్లిన భారతీయుల సగటు వార్షిక సంఖ్య 2,40,000 నుండి 6,60,000 మధ్య ఉన్నది. కేవలం 1911--15 సంవత్సరాల మధ్య మొత్తం 24,83,000 మంది వలస వెళ్లారు. ఒప్పంద వ్యవస్థలోని ఈ భారతీయుల ఇతిహాసం మానవ అక్రమ రవాణాల చరిత్రే. 1833లో బానిసత్వం రద్దయిన తరువాత, తోట యజమానులు అయిన బ్రిటిష్ వ్యాపారులు భారీ ఆర్థిక నష్టాలు చవిచూశారు. ఒకవైపు భారతీయులు స్వేచ్ఛ కోసం తమ ప్రాణాలు త్యాగం చేస్తున్న ఆ సమయంలోనే, బానిసత్వ నష్టాన్ని భర్తీచేసుకోవడానికి అన్ని 'కులాల' భారతీయులను కార్మిక కూలీలుగా మార్చేందుకు బ్రిటిష్ వ్యాపారులు, అధికారులు కలసికట్టుగా కుట్ర పన్నారు. అప్పటి నిరాశాజనక పరిస్థితులను ఆసరాగా చేసుకొని, ఒప్పంద కార్మికుల నియామక వ్యవస్థ పేరున, వలసవాద మోసాలతో, దాదాపు 13 లక్షల మంది భారతీయులను ప్రపంచవ్యాప్తంగా 20 దేశాలకు కూలీల ముద్రవేసి పంపగలిగారు. 1857లో ఈస్టిండియా కంపెనీ పాలనపై దాని సొంత (భారత) సైనికులే తిరుగుబాటు చేశారు. ఆ ఘటన భారతదేశ చరిత్రలో అత్యంత వీరోచిత గాథలలో ఒకటి. సిపాయిల తిరుగుబాటుగా, మొదటి భారత స్వాతంత్ర్య సమరంగా దానిని భావిస్తారు. ఈస్టిండియా కంపెనీ ఓటమిని జీర్ణించులోలేక, బ్రిటిష్ ప్రభుత్వం నేరుగా భారతదేశ పాలనను తన అధీనంలోకి తీసుకున్నది. విక్టోరియా రాణి భారతదేశ సామ్రాజ్ఞి అయింది. సిపాయి తిరుగుబాటులో పాల్గొన్న వందలాది సైనికులకు విధించిన శిక్షలలో ఒకటి-- వారిని ఒప్పంద కార్మికులుగా విదేశాలకు పంపడం! అందులో భాగంగా 1000 మందిని వారి కుటుంబాలతో సహా బెలిజ్‌కు బహిష్కరించారు.తమకు కనీసం 70,000 మంది కావాలని ట్రినిడాడ్‌లోని తోటల యజమానులే అడిగినట్లు బ్రిటిష్ రికార్డులు చెబుతున్నాయి. దాస్య శృంఖలాల నుంచి మాతృభూమి విముక్తికి పోరాడిన వీర యోధులకు బ్రిటిష్ విధించిన శిక్షే ఒప్పంద కార్మిక బానిసత్వం. భారత స్వాతంత్ర్య సమరయోధులు వలసపాలకుల దృష్టిలో రాజద్రోహులయ్యారు. వేల మైళ్ల దూరాన ఉన్న దేశాలకు కుటుంబాలతో సహా బహిష్కృతులయ్యారు. బానిస శ్రామికుల కొరతను భర్తీ చేసేందుకు వారిని ఉపయోగించుకున్నారు. 1858--62 మధ్య కాలంలో మారిషస్, గయానా, ట్రినిడాడ్, గ్రెనడా, సెయింట్ లూసియా, జమైకాకు ఇలా పంపబడిన వారి సంఖ్య 1,57,719 అని వలసలపై నివేదిక ఒకటి పేర్కొంది. మారిషస్‌కు 'వలస' వెళ్ళిన 90,000 మందిలో అత్యధికులు సైనికులే అని ఆ నివేదిక గుర్తించింది. '...సైనిక శిక్షణకు అర్హతలు కలిగి ఉన్న ఒప్పంద కార్మికుల్లో దాదాపు 25 లేదా 30 మంది బహుశా తిరుగుబాటు దళానికి చెందినవారు కావచ్చు' అని వెస్టిండీస్ మైగ్రేషన్ ఏజెంట్ తెలిపాడు. ఈ వాస్తవాన్ని '...వారు అతి జాగ్రత్తగా దాచిపెట్టారు' అని అతడు పేర్కొన్నాడు. నిజానికి, స్వాతంత్ర్య సమరయోధులలో చాలామంది హింస, జైలు శిక్షల ఉచ్చు నుండి తప్పించుకోవడానికి కార్మికులుగా వలసరాజ్యాలకు మారువేషంలో కూడా వెళ్లారు. బ్రిటిష్ పాలనను వ్యతిరేకించినందుకు, గతంలో దేశద్రోహం కేసులో జైలులో పెట్టబడిన వారు కూడా చాలా మంది అందులో ఉన్నారు. 'ఉన్నత కుల' భారతీయ సైనికులు, తోటలలో మారువేషంలో ఉండే అవకాశం ఉందని, అందువల్ల కలకత్తాలోని ఏజెంట్‌కు .బ్రాహ్మణులు, ఠాకూర్లు, ఫకీర్లు, ఇతర శ్రామికేతర కులాల వారు కాలనీకి బయలు దేరకుండా నిరోధించమని' గయానాలోని తోటల యజమానుల నుంచి అనేక సూచనలు జారీఅయ్యాయి. తోటి భారతీయులను సమ్మెకు ప్రేరేపించారనే అనుమానంతో చాలా మంది పండితులు లేదా బ్రాహ్మణులను కూడా గయానా నుంచి బహిష్కరించారు. వారెవరూ ఆయుధాలు ధరించి ఉండేవారు కాదు. భారతీయ జనాభాను సామూహిక తిరుగుబాటుకు ప్రేరేపించే ప్రమాదం ఉందన్న గ్రహింపుతో, అలాంటి బ్రాహ్మణులను వారున్న ప్రాంతంలో హతమార్చలేదు. ఫిజీలో చాలా మంది భారతీయులను ఇతర తోటలకు తీసుకెళ్లే నెపంతో చిన్న పడవలలో రవాణా చేస్తూ పడవలు పడవలనే ముంచేశారు! బ్రిటిష్ వారు దాచిపెట్టిన సామూహిక హత్యాకాండలివి. ఉత్తర భారతావనిలో సైనికుడు లేదా యోధుడికి సిపాయి లేదా సిపాహి అన్న పేరు ఉంది. ట్రినిడాడ్‌లోని భారతీయ సమాజం చాలా కాలంగా కాళీమాతని సిపాయిల/సిపాహీల తల్లి అని పిలుచుకుంటూనే ఉన్నారు. ముదురు నలుపు రంగులో ఆమె ప్రతిమలను తయారు చేసుకున్నారు. హిందూ మతంలో ముఖ్యంగా సైనికులకు లేదా సిపాహీలకు యుద్ధ దేవతగా ఆమె పూజ్యురాలు. ఈస్ట్ ఇండియా కంపెనీ సైనిక స్థావరాలు ఉన్న ప్రాంతాలలో సైనికులు కాళీమాతను పూజించే ఆలయం ఉండేది. 1947 వరకు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య పోరాట యోచనలు చేసే కేంద్రాలుగా కూడా అవి మనుగడలో ఉన్నాయి. వాస్తవానికి, భారతీయ విప్లవకారులు అప్పట్లో కాళీమాత ఆశీర్వాదం కోరేవారు. సుభాష్ చంద్రబోస్ సైతం రహస్యంగా కలకత్తాను విడిచిపెట్టే ముందు దక్షిణేశ్వర్ ఆలయం నుండి కాళీమాత ఆశీర్వాదం పొందారు. ఈ ఆచారం చాలా కాలం ముందే ప్రారంభ మైంది. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 18వ శతాబ్దిలో సాదువులు, ఫకీర్లు కలసికట్టుగా దాదాపు 30 సంవత్సరాలు పోరాడారు. 'సన్యాసి తిరుగుబాటు'గా సుప్రసిద్ధమైన ఆ పోరాటంలో ఎంతో మంది సాధువులు, ఫకీర్లు హతమయ్యారు. ఆ చరిత్రాత్మక తిరుగుబాటులోనే 'వందేమాతరం' ఒక యుద్ధ నినాదంగా మారింది. 1857 తిరుగుబాటు కాలంలో స్వాతంత్ర్య సమరయోధులు, వారితో పాటు పోరాడిన సామాన్య ప్రజల మీద బ్రిటిష్ వారు క్రూరంగా ప్రతీకారం తీర్చుకున్న గ్రామాల సంఖ్యను ఎవరూ లెక్కించలేరు. ఉదాహరణకు బిహార్‌లోని షాబాద్ గ్రామాన్ని మొత్తంగా అగ్నికీలలకు ఆహుతి చేశారు. అయితే ఇది తాను నేను కోరుకున్నంత సంతృప్తికరంగా జరగలేదని బ్రిటిష్ మెజిస్ట్రేట్ వాపోయాడు. పోరాటకారులను, వారికి తోడ్పడిన ప్రజలను శిక్షించేందుకు గ్రామాలకు గ్రామాలనే అనుమానాస్పద జాబితాలో చేర్చారు. చాలా మంది గ్రామీణులు భద్రత కోసం తమ ఇళ్లను విడిచి వెళ్ళవలసి వచ్చింది. 'ఒప్పంద కార్మికులు' అయిన స్వాతంత్ర్య సమరయోధులు తమ మతం, ఆచారాలు, సంప్రదాయాలను మాత్రమే కాకుండా బ్రిటిష వ్యతిరేక పోరాట జ్ఞాపకాలను కూడా తమతో తీసుకెళ్లారు. వాటి ఆధారంగా, ట్రినిడాడ్‌లో తాము నిర్మించుకున్న ఊర్లకు కూడా స్వదేశంలోని తమ తమ కన్న ఊర్ల పేర్లే పెట్టుకున్నారు. ట్రినిడాడ్‌లో ఇప్పటికీ బారక్‌పూర్, ఫైజాబాద్, కలకత్తా సెటిల్‌మెంట్, ఢిల్లీ సెటిల్‌మెంట్, హిందూస్తాన్, మతుర (మధుర), పాట్నా గ్రామాలు కనిపిస్తాయి. మీరట్ అనే వీధిపేరు కూడా తటస్థిస్తుంది.

# మన పొదుపు DNA పోతోంది

పశ్చిమాసియాలో యుద్ధం జరగడమేమిటి? మనకు తిప్పలు రావడమేమిటి? అని ప్రశ్నించుకుంటే ఈ పరిస్థితికి మన రాజకీయ పార్టీలే ప్రధాన కారణం అన్న సమాధానం లభిస్తోంది. ఒకప్పుడు దేశంలో కరువు కాటకాలు ఏర్పడినా ప్రజలు ఆకలి చావులకు గురికాకుండా పని కల్పించడం ద్వారా ప్రభుత్వాలు ఆదుకునేవి. ఇప్పటిలా ఉచిత పథకాల ద్వారా ప్రజలను సోమరిపోతులను చేయలేదు. ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు వినిమయతత్వం పెంచడం వల్ల మానవ వనరులు నిర్వీర్యమయ్యాయి. దీంతో పనులు దొరకని పరిస్థితి నుంచి పనిచేసే వాళ్లు దొరకని పరిస్థితికి చేరుకున్నాం. సూపర్ బజార్లకు వెళ్లిన వాళ్లు అవసరానికి మించి కొనేలా ప్యాకేజింగ్ చేస్తున్నారు. ఆహారాన్ని కూడా దుబారా చేస్తున్నాం. స్విగ్గీ, జొమాటో వంటి డోర్ డెలివరీ వ్యవస్థలు వచ్చిన తర్వాత అవసరానికి మించి ఆర్డర్లు పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆర్డర్లు ఇంటికి చేరేసరికి మనసు మార్చుకొని వచ్చిన వాటిని పక్కన పడేస్తున్నారు. గతంలో ముఖ్యమంత్రులు సాధారణ ప్రజలవలె ప్రయాణికుల విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు. తెలంగాణలో ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని లారీల్లోకి ఎక్కించడానికి హమాలీలు లభించడం లేదు. గతంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి హమాలీ పనులు చేసే వాళ్లు వచ్చేవారు. వాస్తవ పరిస్థితి ఇది కాగా, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం గురించి గొప్పగా చెబుతోంది. ఉపాధి లభించనప్పుడే కదా ఉపాధికి హామీ ఉండాలి? పని ఉన్నా చేయడానికి మనుషులే దొరకనప్పుడు ఉపాధికి హామీ ఏమిటి ఒకప్పుడు ప్రపంచ దేశాల పరిణామాలతో సంబంధం లేకుండా తలెత్తుకొని జీవించిన దేశం మనది. ఒకవైపు అభివృద్ధి చెందామని చెబుతూనే మరో వైపు అంతులేని సంక్షేమ పథకాలు దేనికి? ఈ రెండింటిలో ఏది నిజం? ఏది అవసరం 'గడ్డు పరిస్థితులు ఎదురుకాబోతున్నాయి. ప్రజలంతా పొదుపు పాటించాలి. చమురు వాడకం తగ్గించాలి. బంగారం కొనుగోళ్లు నిలిపివేయాలి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటనతో గల్లీ నుంచి ఢిల్లీ వరకు నేతలంతా ఇప్పుడు పొదుపు మంత్రం జపిస్తున్నారు. ప్రధాని నుంచి ముఖ్యమంత్రుల వరకు తమ వాహన శ్రేణుల సంఖ్యను తగ్గించుకున్నారు. పొదుపు వైపు ప్రజలను మళ్లించడానికి ఇటువంటి చర్యలు ఉపయోగపడవచ్చునుగానీ దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించగలవా? దేశ స్వావలంబన ఎండమావిగానే మిగిలిపోతుందా? అనే ప్రశ్నలకు మాత్రం సమాధానం లభించదు. భారతీయుల డీఎన్ఏలో పొదుపు అంతర్భాగంగా ఉండేది. పొదుపు చేసుకోవడంతోపాటు కష్టపడి పనిచేయడం భారతీయుల లక్షణం. ఈ రెండు లక్షణాలే మన బలం కూడా! ప్రపంచీకరణ పుణ్యమా అని ఇప్పుడు వీటికి మనం దూరమయ్యాం. కేంద్ర, రాష్ట్రాల పాలకులు పోటీ పడి మరీ ప్రజలను వినిమయతత్వంలోకి నెట్టారు. దీంతో అప్పుచేసి పప్పు కూడు తినడానికి ప్రజలు అలవాటుపడ్డారు. తోటి వాడు తొడ కోసుకుంటే తాను మెడ కోసుకునేలా చేశారు. ఫలితంగా ఇప్పుడు మళ్లీ పొదుపు చేయండి మహాప్రభో అని ప్రజలకు చెప్పాల్సిన పరిస్థితి. పశ్చిమాసియాలో యుద్ధం జరగడమేమిటి? మనకు తిప్పలు రావడమేమిటి? అని ప్రశ్నించుకుంటే ఈ పరిస్థితికి మన రాజకీయ పార్టీలే ప్రధాన కారణం అన్న సమాధానం లభిస్తోంది. ఒకప్పుడు దేశంలో కరువు కాటకాలు ఏర్పడినా ప్రజలు ఆకలి చావులకు గురికాకుండా పని కల్పించడం ద్వారా ప్రభుత్వాలు ఆదుకునేవి. ఇప్పటిలా ఉచిత పథకాల ద్వారా ప్రజలను సోమరిపోతులను చేయలేదు. అప్పు చేయడాన్ని అవమానంగా భావించిన ప్రజలకు... అప్పు చేయడం నిత్యావసరంగా మార్చిన ఘనత రాజకీయ పార్టీలది కాదా? కన్జ్యూమరిజంను ఫ్యాషన్‌గా మార్చింది ఎవరు సంక్షేమ పథకాల పేరిట ప్రభుత్వాలు, మితిమీరిన వినిమయతత్వంతో ప్రజలు అప్పులపాలు అవడానికి పాలకులు కారణం కాదా? కూలీనాలీ చేసుకునే వారి చేతిలో కూడా రెండేసి సెల్‌ఫోన్లు అవసరమా? ఆ పరిస్థితి ఎందుకొచ్చింది? జీవన ప్రమాణాలు పెరగడమంటే అప్పు చేసి పప్పు కూడు తినడమా? నిజంగా ప్రజల జీవన ప్రమాణాలు పెరిగి ఉంటే సంక్షేమ పథకాల అవసరమేమిటి? ఉత్పాదక వ్యయం నుంచి అనుత్పాదక వ్యయంవైపు దేశంతో పాటు ప్రజలూ మళ్లడం వికాసం అవుతుందా? నిజంగా దేశం అభివృద్ధి చెంది ఉంటే మన రూపాయి విలువ నానాటికీ ఎందుకు పతనమవుతోంది? ఎగుమతులు పెంచుకోకుండా విచ్చలవిడిగా దిగుమతులను ప్రోత్సహించడం ఏమిటి? ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా రేపటి గురించి ఆలోచించకుండా అప్పులు చేయడం ఏమిటి? నిజమైన ధనవంతుడు ఎవరు అంటే అప్పులేని వాడని ఒకప్పుడు చెప్పుకొనేవారు. ఇప్పుడు ఎంత ఎక్కువ అప్పు చేస్తే అంత గొప్ప అన్న భావనను వ్యాపింపజేశారు. ప్రభుత్వాలు కూడా లక్షల కోట్ల అప్పులు చేస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయడం ఏమిటో తెలియదు. ప్రభుత్వాలతోపాటు ప్రజలు కూడా విలాసాలకు అలవాటుపడేలా చేసింది ఎవరు? సంపాదనలో, సామర్థ్యంలో పోటీ ఉండాలి కానీ అప్పులు చేయడంలో పోటీ ఏమిటి? బడా పారిశ్రామికవేత్తలు అప్పులు చేస్తూ ఎగవేస్తుండగా సామాన్య ప్రజలు మాత్రం అప్పుల నుంచి బయటపడేందుకు అప్పు మీద అప్పు చేసుకుంటూ పోతున్నారు. మన దేశానికి మానవ వనరులే అతి పెద్ద ఆస్తి అని గర్వంగా చెప్పుకొనేవాళ్లం. ఇప్పుడు ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు వినిమయతత్వం పెంచడం వల్ల మానవ వనరులు నిర్వీర్యమయ్యాయి. దీంతో పనులు దొరకని పరిస్థితి నుంచి పనిచేసే వాళ్లు దొరకని పరిస్థితికి చేరుకున్నాం. మన దేశానికి అసలైన ప్రమాదం పనులు చేయడానికి మనుషులు దొరకని పరిస్థితుల వల్ల ఏర్పడనుంది.

**-పొదుపు... అదుపు**

ప్రధానమంత్రి చెబుతున్న పొదుపు విషయానికి వద్దాం! బంగారం కొనుగోళ్లు ఒకప్పుడు తక్కువగా ఉండేవి. మహిళలు పొదుపు చేయడం ద్వారా దాచుకున్న డబ్బుతో బంగారం కొనుక్కొనేవారు. కాసు బంగారం కొనాలన్నా ఒకటికి నాలుగుసార్లు ఆలోచించేవారు. ఇప్పుడు బంగారం కొనడానికి కూడా అప్పులు దొరుకుతున్నాయి. ఏమీ తోచకపోయినా నగల దుకాణానికి వెళుతున్నారు. బంగారం విషయంలోనే కాదు-- ఇంట్లో నిత్యావసరాల వినియోగంలోనూ దుబారా అధికం అయింది. సూపర్ బజార్లకు వెళ్లినవాళ్లు అవసరానికి మించి కొనేలా ప్యాకేజింగ్ చేస్తున్నారు. ఆహారాన్ని కూడా దుబారా చేస్తున్నాం. స్విగ్గీ, జొమాటో వంటి డోర్ డెలివరీ వ్యవస్థలు వచ్చిన తర్వాత అవసరానికి మించి ఆర్డర్లు పెడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆర్డర్లు ఇంటికి చేరేసరికి మనసు మార్చుకొని వచ్చిన వాటిని పక్కన పడేస్తున్నారు. చమురు వాడకం విషయమే తీసుకుందాం! ఒకప్పుడు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రుల కాన్వాయ్‌లలో ఇన్ని వాహనాలు ఉండేవి కావు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి సైతం మూడు వాహనాలే వినియోగించేవారు. వారి భద్రతను నలుగురైదుగురు సిబ్బంది మాత్రమే చూసేవారు. ఇప్పుడు పదుల సంఖ్యలో వాహనాలను కాన్వాయ్‌లో చేర్చారు. ముఖ్యమంత్రుల బహిరంగ సభలు, సమావేశాలకు వందలమంది పోలీసులను నియమిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నక్సలైట్ల ప్రభావం అధికంగా ఉన్నప్పుడు మంత్రులు, ముఖ్యమంత్రులకు అదనపు భద్రత అవసరమయ్యేది. ఇప్పుడు నక్సలైట్లు దాదాపుగా అంతరించిపోయారు కదా? అయినా భద్రతను కుదించడం లేదు. ఇప్పుడు ప్రధాని మోదీ పిలుపుతో దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు తాము వినియోగించే వాహనాల సంఖ్యను తగ్గించుకుంటున్నారు. ఇలాంటి సందర్భాలలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కాస్త అతి ప్రదర్శిస్తారు. ప్రధాని మోదీపై ప్రస్తుతం ఉన్న మోజు వల్ల కాబోలు ఆయన ఏకంగా మంత్రివర్గ సమావేశంలోనే పొదుపు చర్యలపై చర్చలు జరిపారు. అతిగా స్పందిస్తే విమర్శలపాలు అవుతామన్న వాస్తవాన్ని ఆయన విస్మరించారు. ప్రభుత్వాలలో దుబారా సర్వసాధారణం అయింది. ముఖ్యమంత్రులు పాల్గొనే కార్యక్రమాలకు కూడా అలంకరణ అవసరమా? అని ఆలోచించకుండా మన సొమ్ము కాదు కదా అని మంచినీళ్ల ప్రాయంగా ఖర్చు చేస్తుంటారు. ఖర్చుల నియంత్రణ, పొదుపు అనేది ప్రజలకు ఆదర్శంగా ఉండాలి. గతంలో ముఖ్యమంత్రులు సాధారణ ప్రజలవలె ప్రయాణికుల విమానాల్లో వెళ్లేవారు. ఇప్పుడు ప్రత్యేక విమానాలను వాడుతున్నారు. మంత్రులు, ఇతర ప్రముఖులు కూడా చీటికీ మాటికీ ప్రత్యేక విమానాలు, హెలికాప్టర్లు వాడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వాడటం వేరు! ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలకు ప్రత్యేక విమానాల అవసరం ఏమిటి? అంతెందుకూ, ఇదివరకు మంత్రులు రైళ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఎంతమంది రైలెక్కుతున్నారు? అయితే విమానం లేదా భారీ కాన్వాయ్‌లు వేసుకొని తిరుగుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మంత్రులు, అధికారులు వారాంతం వచ్చిందంటే చాలు హైదరాబాద్‌లో వాలిపోతున్నారు. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి కోసం అమరావతి, హైదరాబాద్, బెంగళూరులో ప్రత్యేకంగా భద్రతా సిబ్బంది ఉంటున్నారు. ఇలా చెప్పుకొంటూ పోతే ప్రభుత్వాలలో దుబారాకు అంతే ఉండదు.

**-మండుతున్న ఇంధనం**

ఇంధనం వాడకంలో పొదుపు పాటించాలని ఇప్పుడు చెబుతున్నారుగానీ దేశంలో ఇంధన వినియోగం అమాంతం పెరిగిపోవడానికి కారణం ఎవరు? మన దేశంలో వాహనాల సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతోంది. ఈ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్రాండెడ్ కార్ల ఉత్పత్తిదారులు తమ షోరూంలను మన దేశంలో తెరుస్తున్నారు. ప్రస్తుత ధోరణి కొనసాగితే మన దేశ జనాభాతో వాహనాల సంఖ్య కూడా పోటీ పడుతుంది. ఈ కారణంగా దేశంలో చమురు వినియోగం భారీగా పెరిగిపోయింది. ఫలితంగా విదేశీ మారక ద్రవ్యంపై ఒత్తిడి పెరిగి మన రూపాయి బలహీనపడుతోంది. ఒకప్పుడు ద్విచక్ర వాహనం కొనుగోలు చేయాలన్నా ఒకటికి రెండుసార్లు ఆలోచించేవారు. ఇప్పుడు అవసరం ఉన్నా లేకపోయినా అప్పు పుడుతోంది కదా అని అలా వెళ్లి ఇలా బండి కొనుగోలు చేస్తున్నారు. వెహికల్ లోన్ ఇస్తాం, ఏసీ కొనాలనుకుంటున్నారా? మీ ఇంట్లో రిఫ్రిజరేటర్, వాషింగ్ మెషిన్ వంటివి లేవా? అయితే అప్పు ఇవ్వడానికి మేం రెడీ! అని బ్యాంకుల నుంచి ఫోన్లు చేస్తుంటారు. దీంతో కొని పడేస్తే పోలా అని ప్రజలు మొగ్గుచూపుతున్నారు. వాహనం కొనడానికి అప్పు దొరుకుతోంది కనుక దాన్ని నడపడానికి ఎంత ఖర్చవుతుందని లెక్కలు వేసుకోవడం లేదు. ఆదాయ--వ్యయాలకు పొంతన లేకున్నా... దాని నుంచి బయటపడలేని పరిస్థితి ప్రభుత్వ విధానాల వల్ల ఏర్పడింది. ద్రవ్యోల్బణం పెరగడంతోపాటు ఖర్చులు పెంచుకుంటూ పోవడం వల్ల ఎంత జీతం వస్తున్నా చాలని పరిస్థితి. ఈఎంఐలకు సరిపడా జీతం రావడం లేదన్న అసంతృప్తి ఉద్యోగులలో ఉంటోంది. పొరుగు వాడి ముందు ఎక్కడా తగ్గకూడదన్న ధోరణి ఏర్పడటంతో ఖర్చుల విషయంలో పోటీపడుతున్నారు. గతంలో ఆదాయాన్నిబట్టి ఇంటి బడ్జెట్ ఉండేది. ప్రభుత్వాలు కూడా ఆదాయానికి అనుగుణంగానే బడ్జెట్‌లకు రూపకల్పన చేసేవి. ఇప్పుడు ఇటు ప్రజలు, అటు పాలకులు కూడా అప్పులను దృష్టిలో పెట్టుకొనే బడ్జెట్‌లను రూపొందించుకుంటున్నారు. ఈ పరిస్థితి ఏ అనర్థాలకు దారితీస్తుందో అని ప్రజలతో పాటు ప్రభుత్వాలు కూడా ఆలోచించడం లేదు. అప్పు తీర్చడం ఎలా? అని ఆలోచించకుండా ఇప్పుడు అప్పు పుడుతుందా లేదా అని మాత్రమే ఆలోచిస్తున్నాం. హైదరాబాద్‌లో ఔటర్ రింగు రోడ్డుపై కూడా సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ అయ్యే పరిస్థితి ఏర్పడుతోందంటే వాహనాల సంఖ్య ఏ స్థాయిలో పెరుగుతోందో అర్థం చేసుకోవచ్చు. అలా వెళ్లి ఇలా వాహనంతో ఇంటికి వచ్చే పరిస్థితి ఉన్నప్పుడు ఇలాగే ఉంటుంది మరి. వినిమయతత్వం అనే విష వలయంలో ఇప్పుడు మన దేశం చిక్కుకుంది. అతి వినియోగం వల్ల ప్రభుత్వాలకు ఆదాయం పెరుగుతోంది. దీంతో సంక్షేమ పథకాలు పెరుగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వానికి నెలనెలా సమకూరే జీఎస్టీ ఆదాయం పెరుగుతోంది అని మురిసిపోతున్నాం. అయితే, ఈ మెరుపుల వెనుక అప్పులు పెరుగుతూ ఉన్నాయని మరచిపోతున్నాం. ప్రభుత్వాలతోపాటు ప్రజలు కూడా అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. ఈ అప్పుల విష వలయంలో చిక్కుకోవడంవల్ల సంపాదించే కుటుంబ పెద్ద అకాల మరణంపాలైతే ఆయా కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి.

**-ఇవేం 'పనులు'...**

ప్రభుత్వాల విషయానికి వస్తే... పాలకులు వస్తూ పోతుంటారు. వారికి వ్యక్తిగతంగా పోయేది ఏమీ ఉండదు. ప్రజలను పొదుపు నుంచి దూరం చేసిన రాజకీయ పార్టీలు సంక్షేమం పేరిట ప్రజలను మూకుమ్మడిగా సోమరిపోతులుగా మార్చివేస్తున్నాయి. మధ్యతరగతి ప్రజలు రెక్కలు ముక్కలు చేసుకొని పన్నులు కడుతుండగా... ఆ పన్నుల ఆదాయాన్ని ప్రభుత్వాలు దుర్వినియోగం చేస్తున్నాయి. పన్నుల రూపంలో వస్తున్న ఆదాయంతోపాటు మద్యం విక్రయం ద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమ పథకాలు అమలు చేయడం హైలెట్! ప్రజలను సోమరులుగా చెయ్యడమే కాకుండా వారిని





తాగుబోతులుగా మార్చివేస్తున్న పాపం రాజకీయ పార్టీలది కాదా? సాధారణంగా మనం నిద్ర లేచిన తర్వాత ఏ కాఫీయో టీనో తాగుతాం. ఇప్పుడు తెలుగునాట ఉదయాన్నే మందు తాగేవారు కూడా కనిపిస్తున్నారు. రాత్రి పొద్దు పోయేవరకూ ఆ మత్తులోనే ఉంటున్నారు. ఈ పరిణామాన్ని అభివృద్ధి చెందడం అని అందామా? తెలంగాణలో ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని లారీల్లోకి ఎక్కించడానికి హమాలీలు లభించడం లేదు. ఫలితంగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. పండించిన పంట కల్లాల్లోనే ఉండిపోతోంది. గతంలో ఉత్తరాది రాష్ట్రాల నుంచి హమాలీ పనులు చేసే వాళ్లు వచ్చేవారు. ఇప్పుడు వాళ్లు కూడా తగ్గిపోయారు. ఫలితంగా హమాలీల కొరతతో ధాన్యం కొనుగోళ్లు జరగక రైతులు అల్లాడిపోతున్నారు. వాస్తవ పరిస్థితి ఇది కాగా, కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకం గురించి గొప్పగా చెబుతోంది. ఉపాధి లభించనప్పుడే కదా ఉపాధికి హామీ ఉండాలి? పని ఉన్నా చేయడానికి మనుషులే దొరకనప్పుడు ఉపాధికి హామీ ఏమిటి? ఇంతకంటే బాధ్యతారాహిత్యం ఉంటుందా? ఈ పథకాన్ని వ్యవసాయంతో ముడిపెట్టి రైతులను ఆదుకుంటే రైతు భరోసా వంటి పథకాల అవసరం ఉండదు కదా? ఈ ధోరణుల పట్ల సమాజంలో అంతర్లీనంగా అలజడి ఉంది. ఎవరో కష్టపడి సంపాదించి పన్నులు కడుతుంటే ఇంకెవరో దానధర్మాలు చేయడం ఏమిటి? అది కూడా అపాత్రదానం! ఈ దేశంలో అంబానీ, అదానీ వంటి వారికి వ్యాపారాల అభివృద్ధికి బ్యాంకులు లక్షల కోట్ల రూపాయలు అప్పుగా ఇస్తాయి. అది కూడా అతి తక్కువ వడ్డీకి. మరి బ్యాంకులకు లాభాలు ఎలా వస్తాయి? అని ప్రశ్నించుకుంటే, మధ్యతరగతి ప్రజలు, వ్యాపారులు ఉన్నారు కదా! ఈ వర్గాల నుంచే అధిక శాతం వడ్డీ వసూలు చేస్తుంటారు. ఈఎంఐలు, క్రెడిట్ కార్డులు, డెబిట్ కార్డులకు జనాన్ని అలవాటు చేశారు కనుక ప్రస్తుతానికి బ్యాంకులు లాభాల పంట పండిస్తున్నాయి. ప్రధానమంత్రి చెబుతున్న పొదుపు విషయానికి మళ్లీ వద్దాం! పొదుపు ఎక్కడ నుంచి ప్రారంభించాలి? ప్రభుత్వాలు ప్రకటిస్తున్న పొదుపు చర్యల వల్ల ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కగలమా? ఆర్థిక స్వావలంబన నుంచి దేశాన్ని, ప్రజలను దూరం చేసి ఇప్పుడు పొదుపు చేయమంటే సాధ్యమేనా? ఒకప్పుడు రాష్ట్రాలలో చిన్న మొత్తాల పొదుపు సంస్థలు ఉండేవి. ప్రజలను పొదుపు వైపు ప్రోత్సహించేవారు. ఈ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో ఉండేవి. ఇప్పుడు ఇంట్లో ఉన్న వాళ్లకు కూడా ఫోన్లు చేసి రెచ్చగొడుతూ అప్పులిస్తూ పొదుపు చేయమంటే ఎలా? మీరు కష్టపడి పనిచేయాల్సిన అవసరం లేదు, సంక్షేమం పేరిట ప్రతి నెలా డబ్బు పంచుతాం అని చెబుతూ ఉత్పత్తి పెంచడం సాధ్యమేనా? శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రఖ్యాత కవి శ్రీశ్రీ తన 'మహాప్రస్థానం'లో అద్భుతంగా వివరించారు. ఆ శ్రమ సంస్కృతికి మనం దూరమవుతున్నాం. చైనా ఉత్పత్తులు ప్రపంచ దేశాలలో పోటీ పడటానికి కారణం ఏమిటో ఆలోచించాలి కదా? అక్కడ ఒక సగటు మనిషి చేసే ఉత్పత్తి మన దేశంలోకంటే రెండింతలు ఉంటుంది. ఈ కారణంగా అక్కడి ఉత్పత్తుల ధర తక్కువగా ఉంటోంది. మన అర్థరహితమైన సంక్షేమ పథకాల వల్ల పని సంస్కృతి మాయమవుతోంది. రాజకీయ పార్టీలు ఈ ప్రమాదాన్ని గుర్తించకుండా పొదుపు మాటలు చెప్పడంవల్ల ప్రయోజనం ఉండదు. ఆదాయంతో పొంతన లేకుండా అప్పులు చేసి ఖర్చు పెట్టడం వల్ల కుటుంబాలే కాదు-- ప్రభుత్వాలు కూడా దివాలా తీస్తాయి. సంక్షేమ పథకాలను ప్రకటించడంలో రాజకీయ పార్టీలు పోటీపడటం వల్ల అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. తెలుగు రాష్ట్రాలే ఇందుకు నిదర్శనం. ఏ విషయంలోనైనా సమతూకం పాటించాలని అంటారు. అభివృద్ధి -- సంక్షేమం విషయంలో ఈ సూత్రం వర్తించదా? ఈ ప్రశ్నకు రాజకీయ పార్టీలు సమాధానం చెప్పాలి. అధికారంలో ఉన్నవాళ్లు చేసే అప్పులను ఎవరు తీర్చాలి? ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు పరిస్థితి ఎంత భయానకంగా ఉంటుందో గ్రహిస్తున్నారా? ఉచితాలకు అలవాటుపడిన ప్రజలు పని సంస్కృతికి దూరం అవుతున్నారు కదా! రేపు ప్రభుత్వాలకు కూడా అప్పు పుట్టని పరిస్థితి ఎదురై ఉచితాలు కొనసాగించలేకపోతే ప్రజల పరిస్థితి ఏమిటి? అంతిమంగా ఈ పరిస్థితి సమాజంలో అశాంతికి దారితీయదా? ప్రజలపై పన్నుల భారం పెంచుకుంటూ పోవడం మంచి ప్రభుత్వాలు చేసే పని కాదు కదా? ఇప్పుడు మన దేశంలో కనిపిస్తున్న మెరుపులు కూడా పైపై పూతలే. పరిస్థితి మేడిపండు చందంగా మారకముందే రాజకీయ పార్టీలు, ముఖ్యంగా ప్రభుత్వాలు మేల్కొనాలి. ప్రజలు పొదుపు చర్యలు పాటించాలని చెప్పడం బాగానే ఉందికానీ ప్రభుత్వాలు కూడా దుబారా పథకాలకు స్వస్తి చెప్పాలి కదా! ఎన్నికల రాజసూయ యాగంలో తిరుగులేని శక్తిగా ఉంటున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇప్పుడు ఈ దిశగా ఆలోచించడం అవసరం. ప్రభుత్వాలతో పాటు ప్రజలు కూడా దుబారా ఖర్చులను నివారించగలిగితే ఆర్థిక స్వావలంబన మన చేతుల్లోనే ఉంటుంది. ఒకప్పుడు ప్రపంచ దేశాల పరిణామాలతో సంబంధం లేకుండా తలెత్తుకొని జీవించిన దేశం మనది. ఒకవైపు అభివృద్ధి చెందామని చెబుతూనే మరోవైపు అంతులేని సంక్షేమ పథకాలు దేనికి? ఈ రెండింటిలో ఏది నిజం? ఏది అవసరం? మొత్తంగా మన దేశ గమనాన్ని సమీక్షించి తగు నిర్ణయాలు అవి తాత్కాలికంగా కఠినంగా అనిపించినా తీసుకోవాల్సిన అవసరం లేదా? అత్యంత శక్తిమంతుడిగా అవతరించిన ప్రధాని మోదీ హయాంలోనే ఇవి జరగాలి. హిపోక్రసీకి దూరంగా అన్ని రాజకీయ పార్టీలను కట్టడిచేసే విధంగా కఠిన నిర్ణయాలు తీసుకొని దేశాన్ని నిజమైన అభివృద్ధి బాట పట్టించగలిగితే ప్రధాని మోదీ శాశ్వతంగా కీర్తించబడతారు. ఈ దిశగా అడుగులు వెయ్యకుండా కేవలం ప్రకటనలు, హామీలకే పరిమితమైతే ప్రజల్లో విశ్వాసం ఏర్పడదు. అప్పు సంస్కృతి నుంచి దేశాన్ని, ప్రజలను దూరం చేయగలిగితే పశ్చిమాసియా వంటి యుద్ధ పరిస్థితులు ఎన్ని వచ్చినా మనల్ని ఏమీ చేయలేవు. ఇప్పుడు మనకు కావాల్సింది సంకల్ప బలం మాత్రమే. అది ప్రధాని మోదీలో ఉంటుందనీ, ఉండాలనీ ఆశిద్దాం!

# ముస్సోరీలో తెలంగాణ ఆర్టీసీ ముద్ర

**-ముస్సోరీలో తెలంగాణ ఆర్టీసీ జాతీయ సత్తా..**
**-స్పేర్ పార్ట్స్ ధరల నియంత్రణకు నాగిరెడ్డి కమిటీ..**

హైదరాబాద్, మే 17 ( హంసకలం వార్త )

ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీ వేదికగా నిర్వహించిన అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ అఖిల భారత సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది. అసోసియేషన్ ఛైర్మన్, టీజీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ఆర్టీసీ ఛైర్మన్లు, ఉన్నతాధికారులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పాల్గొని ప్రజా రవాణా రంగ భవిష్యత్తుపై విస్తృత చర్చలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న యుద్ధ పరిస్థితుల ప్రభావంతో స్పేర్ పార్ట్స్ ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీలపై పడుతున్న ఆర్థిక భారం తగ్గించేందుకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. స్పేర్ పార్ట్స్ ధరల మార్పులను నిరంతరం పర్యవేక్షిస్తూ నియంత్రణ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వై. నాగిరెడ్డి ప్రకటించారు. వెండర్లతో జరిగిన కీలక సమావేశంలో ధరల నియంత్రణ, సరఫరా వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేకంగా చర్చించారు. సమావేశంలో తెలంగాణ ఆర్టీసీ అమలు చేస్తున్న విద్యుత్ బస్సుల నిర్వహణ దేశానికే ఆదర్శమని వై. నాగిరెడ్డి వివరించారు. కాలుష్య నివారణలో తెలంగాణ ముందంజలో ఉందని, భవిష్యత్తులో మరిన్ని విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టి హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా రవాణా రంగంలో సమాచార సాంకేతికత వినియోగంలో టీజీఎస్ ఆర్టీసీ అగ్రగామిగా నిలుస్తోందని పేర్కొన్నారు. గ్యారేజీల నిర్వహణ, వాహనాల ఫిట్‌నెస్, విడిభాగాల లభ్యత, మెయింటెనెన్స్ షెడ్యూళ్లను పూర్తిగా డిజిటల్ విధానంలో పర్య వేక్షించడం ద్వారా ప్రయా ణికులకు మరింత సురక్షితమైన సేవలు అంది స్తున్నట్లు వెల్లడించారు.



తెలంగాణలో మహిళల కోసం అమలవుతున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం సమావేశంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ పథకం ద్వారా రికార్డు స్థాయిలో 10 వేల కోట్ల ప్రయాణాలు నమోదవడం పట్ల వివిధ రాష్ట్రాల ప్రతినిధులు తెలంగాణ ఆర్టీసీని అభినందించారు. ఈ సమావేశంలో టీజీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సి హెచ్. వెంకన్నతో పాటు ఉత్తరాఖండ్, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాల ఆర్టీసీ ఛైర్మన్లు, రవాణా రంగ ఉన్నతాధికారులు పాల్గొన్నారు..

# కూకట్ పల్లిలో అయోధ్య రామ మందిరం తరహా అద్భుత సెట్

**-భక్తులతో కిటకిటలాడుతున్న ఫోరమ్ మాల్ పరిసరాలు..**

కూకట్‌పల్లి, మే 17 ( హంసకలం వార్త )

హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి ప్రాంతం ప్రస్తుతం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది. కూకట్‌పల్లి ఫోరమ్ మాల్ పక్కన అయోధ్య రామ మందిరాన్ని తలపించేలా అత్యంత అద్భుతంగా రూపొందించిన భారీ సెట్ నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రసిద్ధ అయోధ్య శ్రీరామ మందిర నిర్మాణ శైలిని ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన ఈ సెట్‌ను చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలివస్తున్నారు. రామ మందిర ఆకృతిలో నిర్మించిన ఈ ప్రత్యేక సెట్ విద్యుత్ దీపాల కాంతుల్లో మరింత ఆకర్షణీయంగా మెరిసిపోతూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తోంది. సాయంత్రం వేళల్లో అయితే ఈ ప్రాంతం పూర్తిగా భక్తులతో నిండిపోతోంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు కుటుంబ సమేతంగా వచ్చి ఆలయ నమూనాను ఆసక్తిగా వీక్షిస్తున్నారు. చాలామంది మొబైల్ ఫోన్లలో ఫోటోలు, వీడియోలు చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో పంచుకుంటున్నారు. అసలైన




అయోధ్య రామాలయాన్ని ప్రత్యక్షంగా చూసిన అనుభూతి కలుగుతోందని సందర్శకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నగరంలో ఇంత అద్భుతమైన ఆధ్యాత్మిక సెట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వెలుగుల అలంకరణ మధ్య ఈ సెట్ మరింత అందంగా కనిపిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. భారీగా ప్రజలు తరలి వస్తుండటంతో ఫోరమ్ మాల్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ కూడా కనిపిస్తోంది. భక్తుల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. కూకట్‌పల్లిలో ప్రస్తుతం ఈ అయోధ్య రామ మందిర సెట్ హాట్ టాపిక్‌గా మారి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇంకా ఈ అద్భుతాన్ని వీక్షించని వారు తప్పకుండా సందర్శించాలని స్థానికులు సూచిస్తున్నారు..

# బీజేపీ నుంచి బండి సంజయ్ ఔట్

**- కేంద్ర మంత్రి కొడుకుకే లుకౌట్ నోటీసు..**
**-బండి సంజయ్ బర్తరఫ్ చేయాలంటూ బీఆర్ఎస్ ఫైర్..**
**-బాధిత కుటుంబాన్ని బెదిరించారు అంటూ సంచలన ఆరోపణలు..**

హైదరాబాద్, మే 17 ( హంసకలం వార్త )

మైనర్ బాలికపై జరిగిన దారుణ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపుతుండగా, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథకు రాజకీయ అండదండలు లభిస్తున్నాయంటూ బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సాధారణ వ్యక్తి కొడుకు అయితే ఇంతకాలం బయట తిరిగేవాడా.?అంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడింది. బేటీ బచావో, బేటీ పడావో అంటూ దేశానికి ఉపన్యాసాలు ఇచ్చే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఇప్పుడు మైనర్ బాలికకు న్యాయం జరిగేలా ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా ఒక కేంద్ర మంత్రి కుమారుడిపై లుకౌట్ నోటీసు జారీ కావడం సిగ్గుచేటని విమర్శించారు. భగీరథను తొమ్మిది రోజుల పాటు దాచిపెట్టి, బాధిత బాలిక కుటుంబాన్ని బెదిరించే ప్రయత్నం జరిగిందని ఆరోపించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ స్వయంగా ఒత్తిళ్లు తెచ్చారని, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించారని తీవ్ర విమర్శలు గుప్పించారు. హనీ ట్రాప్ మనీ ట్రాప్ అంటూ అసలు నేరాన్ని పక్కదారి పట్టించే కుట్ర జరిగిందని ఆరోపించారు. మీడియాపై ఒత్తిడి తెచ్చి వార్తలు బయటకు రాకుండా చేయడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని మండిపడ్డారు. అధికారంలో ఉన్నవారికి చట్టం వర్తించదా.? ఒక ఆడబిడ్డ న్యాయం కోసం పోరాడితే ఇదేనా ప్రభుత్వాల స్పందన అంటూ ప్రశ్నించారు. ఈరోజు కేంద్ర మంత్రి కొడుకు తప్పించుకుంటే, రేపు ఏ ఆడబిడ్డ పోలీస్ స్టేషన్‌కి వెళ్లే ధైర్యం చేయదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే వెంటనే కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించి, కేసును నిష్పాక్షికంగా విచారించాలని డిమాండ్ చేశారు. బాధిత బాలిక తల్లిదండ్రులు బెదిరింపులకు




లొంగకుండా పోరాడటం గొప్ప విషయమని కొనియాడారు. బీఆర్ఎస్ మహిళా నాయకత్వం, విద్యార్థి సంఘాలు, సామాజిక మాధ్యమ కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు నిర్వహించడంతోనే కేసు ముందుకు కదిలిందన్నారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోరాటం ఫలితంగానే భగీరథ అరెస్టు జరిగిందని పేర్కొన్నారు. ప్రజా ఒత్తిడి లేకపోతే ఈ కేసును పూర్తిగా మూసివేసే ప్రయత్నం జరిగేదని ఆరోపించారు..

# తాగి డ్రైవ్ చేస్తే జైలు ఖాయం

**-వీకెండ్ వేటలో 300 మందికి ట్రాఫిక్ పోలీసుల షాక్..**
**-డ్రంక్ డ్రైవ్ చేస్తే 10 ఏళ్ల జైలు తప్పదని హెచ్చరిక..**

సైబరాబాద్, మే 17 ( హంసకలం వార్త )

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భారీగా మద్యం మత్తులో వాహనాలు నడిపిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. సైబరాబాద్ ట్రాఫిక్ అదనపు డీసీపీ జి హన్మంతరావు వివరాల ప్రకారం, ప్రత్యేక తనిఖీల్లో మొత్తం 300 మందిపై కేసులు నమోదు చేశారు. పట్టుబడిన వారిలో 253 మంది ద్విచక్ర వాహనదారులు, 9 మంది ఆటో డ్రైవర్లు, 38 మంది కార్ డ్రైవర్లు ఉన్నారు. హెవీ వాహనాలపై ఎలాంటి కేసులు నమోదు కాలేదు. రక్తంలో ఆల్కహాల్ మోతాదు ఆధారంగా కేసులను వర్గీకరించగా 232 మంది 36 మిల్లీగ్రాముల నుంచి 200 మిల్లీగ్రాముల మధ్య, 35 మంది 201 నుంచి 300 మిల్లీగ్రాముల మధ్య, 33 మంది 301 నుంచి 550 మిల్లీగ్రాముల మధ్య మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు తేలింది. పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపర్చనున్నట్లు అధికారులు తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం తీవ్రమైన నేరమని పోలీసులు హెచ్చరించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే భారతీయ న్యాయ సంహిత--2023 సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ నేరానికి గరిష్టంగా పదేళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. గత వారం మే 11 నుంచి మే 16 వరకు నమోదైన 96 డ్రంక్ డ్రైవింగ్



కేసులను కోర్టులు పరిష్కరించాయి. వీరిలో 7 మందికి జరిమానాతో పాటు జైలు శిక్ష, 2 మందికి జరిమానాతో పాటు సామాజిక సేవ, 87 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు..తాగి డ్రైవ్ చేస్తే జైలు ఖాయం

## శేరిలింగంపల్లిలో భారీ ఆరోగ్య శిబిరం



శేరిలింగంపల్లి, మే 17 ( హంసకలం వార్త )

శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్‌ను యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు యలమంచి ఉదయ్ కిరణ్ మర్యాదపూర్వకంగా కలిసి మెగా మెడికల్ క్యాంప్ ఆహ్వాన పత్రిక అందజేశారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మెగా మెడికల్ క్యాంప్‌లో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు, ఆరోగ్య సూచనలు, అవసరమైన మందులు అందించనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శరత్, రాధాకృష్ణ, ప్రవీణ్, వంశీ, వినయ్, నవీన్ తదితరులు పాల్గొని క్యాంప్ విజయవంతానికి తమ పూర్తి సహకారం అందించారు..

## బండి భగీరథుకు జ్యుడీషియల్ రిమాండ్

**-భారీ బందోబస్తుతో చర్లపల్లి జైలుకు తరలింపు..**
**-మే 29 వరకు రిమాండ్ విధించిన మేడ్చల్ కోర్టు..**
**-దర్యాప్తుకు పూర్తి సహకారం అందిస్తున్నాం..న్యాయవాది కరుణాసాగర్..**




హైదరాబాద్, మే 17 ( హంసకలం వార్త )

పోక్సో కేసులో అరెస్టైన బండి భగీరథుకు మేడ్చల్ కోర్టు మే 29 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల అనంతరం పోలీసులు నిందితుడిని భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. కేసు తీవ్రత దృష్ట్యా కోర్టు పరిసరాల్లో కూడా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఈ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపగా, భగీరథు అరెస్టు తర్వాత రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విచారణలో భాగంగా పోలీసులు ఇప్పటికే పలు ఆధారాలను సేకరించినట్లు సమాచారం. బాధితురాలి వాంగ్మూలం, సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా తదితర అంశాలపై అధికారులు లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, నిందితుడి తరఫు న్యాయవాది కరుణాసాగర్ మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భగీరథును మేమే స్వచ్ఛందంగా పోలీసులకు అప్పగించాం. దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తున్నాం. విచారణలో అన్ని నిజాలు వెలుగులోకి వస్తాయి. ఆయన నిర్దోషిగా బయటకు వస్తారని మాకు పూర్తి నమ్మకం ఉంది అని తెలిపారు. మరోవైపు కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని పోలీసులు జాగ్రత్తగా పరిశీలిస్తున్నారని, ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా నిష్పక్షపాతంగా విచారణ కొనసాగిస్తున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. కేసు తదుపరి విచారణపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది..

## కేపీహెచ్‌బీ పోలీసుల స్పీడ్ ఆపరేషన్

**-20 నిమిషాల్లో మిస్సింగ్.. 2 గంటల్లో బ్యాగ్ రికవరీ..**
**-కేపీహెచ్‌బీ పోలీసుల స్పీడ్ ఇన్వెస్టిగేషన్‌కు ప్రశంసలు..**

సైబరాబాద్, మే 17 ( హంసకలం వార్త )




సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళ హ్యాండ్‌బ్యాగ్ మిస్సైన ఘటనలో పోలీసులు వేగంగా స్పందించి కేవలం రెండు గంటల్లోనే బ్యాగ్‌ను గుర్తించి బాధితురాలికి అప్పగించారు. తాడేపల్లికి చెందిన వైఎస్ రాజేశ్వరి చందానగర్‌లో పూజ కార్యక్రమానికి హాజరై విజయవాడకు తిరుగు ప్రయాణంలో కేపీహెచ్‌బీ బస్ స్టాండ్‌కు చేరుకున్నారు. ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం సుమారు 3:15 గంటల సమయంలో ఇతర లగేజీ తీసుకెళ్లే క్రమంలో హ్యాండ్‌బ్యాగ్‌ను అక్కడే మరిచిపోయారు. సుమారు 20 నిమిషాల తరువాత తిరిగి వచ్చి చూడగా బ్యాగ్ కనిపించలేదు. మిస్సైన హ్యాండ్‌బ్యాగ్‌లో రూ.25 వేల నగదు, బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులు ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సమాచారం అందుకున్న కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ అధికారి రాజశేఖర్ రెడ్డి, రవి తమ బృందంతో కలిసి కేసును సవాల్‌గా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల సహాయంతో పోలీసులు వేగంగా విచారణ జరిపి కేవలం రెండు గంటల్లోనే హ్యాండ్‌బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తక్షణ స్పందనపై బాధితురాలు వైఎస్ రాజేశ్వరి ఆనందం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు..

హంస కలం వార్త
సోమవారం 18 మే 2026

# కొడుకు నేరం ఒప్పుకుంటే తండ్రి రాజకీయ భవిష్యత్ ఏమిటి

మే 17 ( హంసకలం వార్త )



బండి భగీరథ్ తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశంలోనే ఓ ట్రెండింగ్ పర్సనాలిటీగా మారాడు.దానికి కారణం అయనపై పోక్సో కేసు నమోదు కావడం మాత్రమే కాదు. ఆయన తండ్రి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కావడంతో దీనికి ప్రాధాన్యత అమాంతం పెరిగింది. గత వారం రోజులుగా తెలంగాణ రాజకీయాల్లో సంచలనం రేపిన బండి సాయి భగీరథ్ పోక్సో కేసు ఇప్పుడు కేవలం ఒక క్రిమినల్ కేసుగా మాత్రమే కాకుండా, రాజకీయంగా కూడా తీవ్ర ప్రభావం చూపే అంశంగా మారింది.కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు భగీరథ్ ఈ కేసులో పోలీసుల ఎదుట హాజరై, అనంతరం జైలుకు వెళ్లిన పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీశాయి.అయితే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ప్రధానంగా వినిపిస్తున్న ప్రశ్న ఒక్కటే..."ఈ కేసు తర్వాత బండి సంజయ్ రాజకీయ భవిష్యత్‌పై ఎలాంటి ప్రభావం పడబోతోంది?" భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైనప్పటి నుంచి బీజేపీ, ప్రతిపక్షాలు,సోషల్ మీడియా, న్యాయ వర్గాల్లో తీవ్రమైన చర్చ కొనసాగింది.ఈ వ్యవహారంలో మొదటి నుండి బండి సంజయ్ తీసుకున్న వైఖరి కూడా ప్రత్యేకంగా చర్చనీయాంశమైంది."చట్టం ముందు అందరూ సమానమే...నా కొడుకు అయినా చట్టానికి లోబడాల్సిందే" అంటూనే తన కొడుకు ఎలాంటి తప్పు చేయలేదని చెబుతున్నాడని,నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే ఆధారాలు ఉన్నాయని,కావాలని తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక కొందరు తన కొడుకును అడ్డం పెట్టుకొని నా కుటుంబంపై బురదజల్లుతున్నారని చెబుతూనే, తన అనుచరులు,అనుకూల మీడియా ద్వారా అమ్మాయి క్యారెక్టర్ ను బజారుకీడ్చే ప్రయత్నాలు చేయడంతో ఇది మరింత హీట్ పెంచింది.ఆయన చేసిన వ్యాఖ్యలు ఒకవైపు ప్రశంసలు అందుకోగా,మరోవైపు రాజకీయ విమర్శలకు కూడా దారితీశాయి.బండి సంజయ్ తన కుమారుడు నిర్దోషి అని చెబుతూనే,చట్టంపై గౌరవంతో పోలీసుల విచారణకు సహకరించామని వెల్లడించారు."నా కొడుకు ఏ తప్పూ చేయలేదని చెబుతున్నాడు..సత్యం గెలుస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే కేసులో తాజా పరిణామాలు చూస్తే...భగీరథ్ పోలీసులకు చిక్కడం,నేరం అంగీకరించడం,జైలుకు వెళ్లడం, దర్యాప్తు తీవ్రత పెరగడం వంటి అంశాలు రాజకీయంగా బీజేపీకి ఇబ్బందికర పరిస్థితులను సృష్టించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

**-రాజకీయంగా రెండు కోణాలు**

ఈ కేసులో బండి సంజయ్‌కు రాజకీయంగా రెండు విధాల ప్రభావం కనిపించే అవకాశం ఉంది. కొంత ఆలస్యమైనా కేంద్ర మంత్రి హోదాలో ఉండి చట్టానికి సహకరించిన నేతగా ఇమేజ్ ఒకవైపు,తన కుమారుడిని దాచి పెట్టకుండా చివరకు పోలీసుల విచారణకు అప్పగించడం ద్వారా "చట్టం ముందు అందరూబీ సమానమే"అనే సందేశాన్ని బండి సంజయ్ ఇవ్వడానికి ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. రాజకీయాల్లో కుటుంబ సభ్యులపై ఆరోపణలు వచ్చినప్పుడు చాలామంది నేతలు రక్షణాత్మక వైఖరి తీసుకుంటారు.కానీ,బండి సంజయ్ మాత్రం బహిరంగంగా స్పందిస్తూ న్యాయవ్యవస్థపై నమ్మకం ఉందని చెప్పడం కొంతమందికి సానుకూల సంకేతంగా కనిపిస్తోంది.ఇక మరోవైపు ఈ కేసు ప్రతిపక్షాలకు బలమైన రాజకీయ ఆయుధంగా మారింది."సాధారణ వ్యక్తి అయితే ఇదే పరిస్థితి ఉండేదా?","రాజకీయ ప్రభావం పనిచేసిందా?' ',"ఎందుకు ఆలస్యం జరిగింది?" వంటి ప్రశ్నలను ప్రతిపక్షాలు లేవనెత్తుతున్నాయి.ముఖ్యంగా మహిళా సంఘాలు,విద్యార్థి సంఘాలు,సోషల్ మీడియా ఈ కేసులో కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

**-బీజేపీపై ప్రభావం ఉంటుందా?**

తెలంగాణలో బీజేపీ గత కొన్ని సంవత్సరాలుగా తన రాజకీయ స్థాయిని పెంచుకునేందుకు ప్రయత్నిస్తోంది.ఆ క్రమంలో బండి సంజయ్ పార్టీకి ముఖ్యమైన ముఖచిత్రంగా ఎదిగారు.బలమైన ప్రసంగాలు,దూకుడు రాజకీయాలతో ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించారు.అయితే ఇప్పుడు కుటుంబానికి సంబంధించిన ఈ వివాదం ఆయన వ్యక్తిగత ఇమేజ్‌తో పాటు పార్టీపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది.ప్రత్యేకంగా యువత, మహిళా ఓటర్లలో ఈ కేసు ఎలా ప్రభావం చూపుతుందనేది కీలక అంశంగా మారింది.పోక్సో వంటి సున్నితమైన కేసులు సాధారణంగా ప్రజల్లో భావోద్వేగ స్పందనను కలిగిస్తాయి.అందుకే ఈ వ్యవహారాన్ని బీజేపీ అత్యంత జాగ్రత్తగా హ్యాండిల్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.న్యాయపరమైన పరిణామాలే కీలకంగా మారే ఛాన్స్ వుంటుంది.ఈ కేసులో తుది ప్రభావం పూర్తిగా న్యాయపరమైన పరిణామాలపైనే ఆధారపడి ఉంటుందనేది అందరికీ తెలుసు. పోలీస్ దర్యాప్తులో ఏమి బయటపడుతుంది? కోర్టులో ఎలాంటి ఆధారాలు సమర్పించబడతాయి? భగీరథ్‌పై ఆరోపణలు ఎంతవరకు రుజువవుతాయి? అనే అంశాలే చివరకు రాజకీయ ప్రభావాన్ని నిర్ణయించే అవకాశముంది.ఒకవేళ కేసులో భగీరథ్‌కు వ్యతిరేకంగా బలమైన ఆధారాలు బయటపడితే బండి సంజయ్ రాజకీయంగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోవాల్సి రావచ్చు. అదే సమయంలో న్యాయపరంగా ఉపశమనం లభిస్తే,"చట్టపరంగా పోరాడి బయటపడ్డాం" అనే వాదనతో బీజేపీ ముందుకు వెళ్లే అవకాశమూ ఉంది.ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చ ఇదే.బండి సంజయ్ ఇమేజ్‌పై ఈ కేసు ఎంత ప్రభావం చూపుతుంది? బీజేపీ ఈ సంక్షోభాన్ని ఎలా ఎదుర్కొంటుంది ప్రతిపక్షాలు ఈ అంశాన్ని ఎంతవరకు రాజకీయంగా వినియోగిస్తాయి? న్యాయపరమైన పరిణామాలు ఎటువైపు మలుపు తిప్పుతాయి? ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఈ ప్రశ్నల చుట్టూనే చర్చ నడుస్తోంది.భగీరథ్ పోక్సో కేసు ఇక కేవలం ఒక కుటుంబం లేదా ఒక కేసు పరిమితిలో లేకుండా,రాజకీయ నైతికత, చట్టపరమైన సమానత్వం,ప్రజా ప్రతినిధుల బాధ్యతలపై పెద్ద చర్చకు దారితీసింది.

# ఉద్యమ వీరులకు ప్రభుత్వ సలాం

**-తెలంగాణ ఉద్యమ వీరులకు ప్రభుత్వ గుర్తింపు..**
**-ఉద్యమకారుల జాబితా సిద్ధం చేయనున్న కమిటీ..**
**-కేశవరావు నేతృత్వంలో తొలి కీలక సమావేశం..**
**-త్యాగాలకు గౌరవం.. సంక్షేమంపై ప్రత్యేక దృష్టి..**

హైదరాబాద్, మే 17 ( హంసకలం వార్త )

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సేవలు, త్యాగాలకు అధికారిక గుర్తింపు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు శనివారం బంజారాహిల్స్‌లో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు నివాసంలో తొలి సమావేశం నిర్వహించారు. కమిటీ భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమకారుల గుర్తింపు విధానం, అమలు చేయాల్సిన మార్గదర్శకాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించి, వారి సేవలు, త్యాగాలకు ప్రభుత్వ స్థాయిలో గౌరవం కల్పించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ సాధన కోసం సాగిన దీర్ఘకాల ఉద్యమంలో విద్యార్థులు, యువత, ఉద్యోగులు, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు కీలక పాత్ర పోషించారు. ఉద్యమ సమయంలో పలువురు ప్రాణత్యాగాలు చేయగా, మరికొందరు శారీరక వైకల్యాలకు గురయ్యారు. అనేక మంది ఉద్యమకారులపై కేసులు నమోదై జైలు జీవితం కూడా అనుభవించారు. తెలంగాణ ఆవిర్భావానికి తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులకు గుర్తింపు ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్లు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉద్యమ చరిత్రను సంరక్షిస్తూ, ఉద్యమకారుల త్యాగాలను భావితరాలకు తెలియజేసే బాధ్యతను కమిటీ చేపట్టనుంది. కమిటీకి కే. కేశవరావు చైర్మన్‌గా వ్యవహరిస్తుండగా, సభ్యులుగా పొన్నం ప్రభాకర్, కోదండరాం, అద్దంకి దయాకర్, ఎస్. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ రాజకీయ విభాగం



కార్యదర్శి కమిటీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఉద్యమకారులను గుర్తించేందుకు స్పష్టమైన ప్రమాణాలు రూపొందించడం, సమగ్ర జాబితా సిద్ధం చేయడం, వారికి అందించాల్సిన గౌరవాలు, గుర్తింపులు, సంక్షేమ సౌకర్యాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయడం కమిటీ ప్రధాన బాధ్యతలుగా నిర్ణయించారు. తెలంగాణ కోసం పోరాడిన ప్రతి ఉద్యమకారుడి త్యాగాన్ని ప్రభుత్వం గుర్తిస్తుందని, వారికి న్యాయం జరిగేలా కట్టుబడి ఉంటామని కమిటీ సభ్యులు స్పష్టం చేశారు..

# నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తా

**-అక్కేపల్లి చెరువును పరిశీలించిన మంత్రి అడ్లూరి**

మే 17 ( హంసకలం వార్త )

నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగనీరు అందించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, ఇందులో భాగంగా నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఆదివారం ధర్మపురి మండలం లోని అక్కేపల్లి చెరువును మంత్రి లక్ష్మణ్ కుమార్ ఇరిగేషన్ అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కాగితాలకే పరిమితమైన అక్కేపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు రోల్లవాగు ప్రాజెక్టు, వెల్గటూర్ ఎత్తిపోతల పథకం, పత్తిపాక రిజర్వాయర్ పనులను పూర్తి చేస్తామని మంత్రి అడ్లూరి వెల్లడించారు. అక్కెపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ తో పాటు నియోజకవర్గం లోని అన్ని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలవడం జరిగిందని, ఇందుకు సంబంధించిన ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిధులు విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ని కలవడం జరిగిందని మంత్రి వివరించారు. ఏడాదిలోపు



పెండింగ్ ప్రాజెక్టు పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు మంత్రి వివరించారు.అక్కేపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు నిర్వహించే ఏజెన్సీ పనిచేయకపోవడంతో వారి స్థానంలో కొత్త ఏజెన్సీకి అవకాశం కల్పించినట్లు మంత్రి వివరించారు. అక్క పెల్లి రిజర్వాయర్ పనులు త్వరలోనే ప్రారంభించి రైతుల సూచనలు మేరకు నియోజకవర్గంలోని 5వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని మంత్రి తెలిపారు.గత ప్రభుత్వ కాలంలో రోల్ల వాగు ప్రాజెక్టుకు అటవీ శాఖ అనుమతి లేకుండానే పనులు ప్రారంభించారని మంత్రి ఆరోపించారు. ప్రాజెక్టు అంచనాలు పెంచి రైతులకు ఒక ఎకరానికి సైతం నీళ్లు ఇవ్వలేదని మంత్రి అన్నారు. రోళ్ళ వాగు ప్రాజెక్టు అటవీ శాఖ అనుమతులు సాధించి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. వచ్చే గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం మొదటి విడతగా రూ. 118 కోట్లు విడుదల చేసిందని ఇందుకు సంబంధించిన పనుల టెండర్లు త్వరలోనే పూర్తి అవుతాయని మంత్రి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సమన్వయం చేసుకొని పుష్కరాల పనులు పూర్తి చేయాలని మంత్రి అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు.

# యాదాద్రి దేవస్థానంలో భక్తుల దోపిడీ జరుగుతోందంటూ ఫిర్యాదు

**-కాటేజీలు,ప్రసాదాల పేరుతో అదనపు వసూళ్లు చేస్తున్నారంటూ ఆరోపణలు**

మే 17 ( హంసకలం వార్త )

యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో భక్తుల నుంచి వివిధ రూపాల్లో అదనపు వసూళ్లు జరుగుతు న్నాయంటూ ఆదివారం నరసింహ స్వామి వేషధారణలో ఆలయ ఈవోకు ఫిర్యాదు చేశారు. దేవస్థానంలో గదుల కేటాయింపు, ప్రత్యేక దర్శనాలు, ప్రసాదాల విక్రయాలు,ఇతర సేవల విషయంలో నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తు న్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దేవస్థానంలో కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సాధారణంగా అందాల్సిన సేవలకు అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారని,రూ.30 నుంచి రూ.40 వరకు అదనంగా తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రసాదాల విక్రయాల్లో కూడా అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు దారులు ఆరోపించారు. అంతేకాకుండా ,గదుల కేటాయింపులో కూడా పారదర్శకత లేదని,కొందరు మధ్యవర్తుల ద్వారా భక్తుల నుంచి అధిక మొత్తాలు తీసుకుని గదులు కేటాయి స్తున్నారని ఫిర్యాదులో వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులు కుటుంబాలతో కలిసి ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.దేవస్థానంలో పనిచేస్తున్న



కొంతమంది సిబ్బంది, కాంట్రాక్టర్ల మధ్య అవగా హనతో ఈ వ్యవహారం కొనసాగుతోందని,దీని వల్ల సాధారణ భక్తులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆరోపించారు. కొన్నిచోట్ల అధికారిక రేట్లకు మించి వసూళ్లు చేస్తు న్నారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.ఈ అంశంపై ఆలయ ఈవో తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులతో విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారులు కోరారు.భక్తుల నుంచి అధిక వసూళ్లు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆలయ పరిపాలనలో పారదర్శకత తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. యాదాద్రి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రంలో ఇటువంటి ఆరోపణలు రావడం భక్తుల్లో ఆందోళన కలిగిస్తోంది.అయితే ఈ ఫిర్యాదులపై ఆలయ అధికారుల నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.







# పోరాడితే పోయేదేమీ లేదు...హక్కుల సాధన సాధ్యమే

మే 17 ( హంసకలం వార్త )

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయుల సమస్యలపై రెండున్నరేళ్ల తర్వాత ముఖ్యమంత్రి పీఆర్సీ అంశంపై సానుకూలంగా స్పందించడం ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు నెలల్లోపు పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు,హెల్త్ కార్డులు,డీఏల విడుదల వంటి హామీలు మేనిఫెస్టోలో ఇచ్చినా,దాదాపు 30 నెలలు గడిచినా అమలు దిశగా స్పష్టమైన చర్యలు కనిపించలేదని ఉద్యోగ వర్గాలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఉద్యోగ సంఘాలు చేపట్టిన ఆందోళనల ఒత్తిడితో ప్రభుత్వం చర్చలకు రావడం,నాలుగు అంశాలపై హామీలు ఇవ్వడం ఉద్యమ విజయంగా ఉద్యోగులు భావిస్తున్నారు.పీఆర్సీ జూలై 2023 నుంచే అమల్లోకి రావాల్సి ఉండగా, గత ప్రభుత్వం మధ్యంతర భృతిగా 5 శాతం ప్రకటించింది.అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా పీఆర్సీ అమలు కాలేదు.ప్రతిపక్ష నేతలు అసెంబ్లీలో ప్రశ్నించిన వెంటనే పీఆర్సీ కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగించడం,ఆపై ఉద్యోగ సంఘాల ఒత్తిడితో నివేదిక త్వరగా ఇవ్వాలని ఆదేశించడం రాజకీయ అవసరంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి,పెరుగుతున్న అప్పులు,పడిపోతున్న ఆదాయం నేపథ్యంలో ప్రభుత్వం మెరుగైన ఫిట్మెంట్ ఇవ్వగలదా అనే అనుమానాలు ఉద్యోగుల్లో వ్యక్తమవుతున్నాయి. పెరుగుతున్న నిత్యావసర ధరలు,విద్యా–వైద్య ఖర్చులు ఉద్యోగ కుటుంబాలను తీవ్ర ఆర్థిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇక రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి.మార్చి 2024 నుంచి పదవీ విరమణ పొందిన వేలాది మంది ఉద్యోగులకు రావాల్సిన పెన్షన్ బకాయిలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు ఇప్పటికీ పూర్తిగా చెల్లించలేదని ఆరోపణలు ఉన్నాయి.సుమారు 30 వేల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా,మానసిక ఒత్తిడితో పలువురు మరణించారని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి. హైకోర్టు జోక్యం తర్వాత ప్రభుత్వం 100 రోజుల్లో బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా,మొత్తం బకాయిలపై స్పష్టత ఇవ్వలేదని విమర్శిస్తున్నారు. రూ.14 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని చెప్పిన ప్రభుత్వం రూ.6 వేల కోట్ల విడుదలతో సరిపెట్టడం, మిగిలిన మొత్తంపై గడువు ప్రకటించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.ఆరోగ్య కార్డుల వ్యవహారం కూడా ఉద్యోగుల్లో అసంతృప్తిని పెంచుతోంది. క్యాబినెట్ ఆమోదం తెలిపి నెలలు గడిచినా అమలు జరగకపోవడం, విధి విధానాలు కూడా ఖరారు కాకపోవడం విమర్శలకు దారితీసింది.కార్పొరేట్ ఆసుపత్రుల్లో క్యాష్‌లెస్ వైద్యం, అవుట్ పేషెంట్ సౌకర్యం,వెల్‌నెస్ సెంటర్లలో నాణ్యమైన సేవలు అందించాలని ఉద్యోగులు కోరుతున్నారు.పెండింగ్ మెడికల్ బిల్లులు పూర్తిగా చెల్లించామని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ,జిల్లా స్థాయిలో వేలాది బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయని ఉద్యోగులు చెబుతున్నారు. జూన్ 2 నుంచి హెల్త్ కార్డులు అమలు చేస్తామని సీఎం ప్రకటించగా, ఈసారి అయినా హామీ నెరవేరుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సీపీఎస్ రద్దు విషయంలో కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ పునర్నిర్మాణం చేశామని ప్రకటించినా, రాష్ట్ర లేదా జిల్లా స్థాయిలో సమావేశాలు జరగకపోవడం విమర్శలకు కారణమైంది.సీపీఎస్ రద్దు కేవలం ఆర్థిక సమస్య కాకుండా విధాన పరమైన నిర్ణయం అయినప్పటికీ, ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు .డీఏల అంశంలో తెలంగాణ దేశంలోనే అత్యధిక బకాయిలు ఉన్న రాష్ట్రంగా మారిందని ఉద్యోగ సంఘాలు చెబుతున్నాయి.2023 జూలై నుంచి రావాల్సిన ఐదు విడతల డీఏలు ఇప్పటికీ విడుదల కాలేదు.పీఆర్సీతో ముడిపెట్టి డీఏలను వాయిదా వేసే ప్రయత్నం జరుగుతోందని ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.దీని వల్ల ప్రతి ఉద్యోగి నెలకు వేల రూపాయల నష్టం చవిచూస్తున్నారని పేర్కొంటు న్నారు. ఈ మొత్తం పరిణామాల్లో ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో చర్చలు జరపడం ఒక ఉద్యమ ఫలితమని ఉద్యోగ వర్గాలు భావిస్తున్నాయి.ఆర్టీసీ కార్మికులు, ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనలు ప్రభుత్వాన్ని స్పందించేలా చేశాయని చెబుతున్నారు. అయితే గతంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదనే అనుభవం కారణంగా ఈసారి కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పోరాటాల ద్వారానే గతంలో పీఆర్సీలు సాధించు కున్నామని, హక్కుల కోసం మళ్లీ ఉద్యమాలే మార్గమని ఉద్యోగ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి.

# హీరోలంతా బీర్ల కోసం రేవంత్ దగ్గరికి వెళ్లారా? సీఎం షాకింగ్ కామెంట్స్

–సీఎం రేవంత్ రెడ్డి చేసిన లేటెస్ట్ కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశం?

–అమెరికా అంబాసిడర్ వచ్చినా,సాఫ్ట్వేర్ సీఈఓ వచ్చినా ఒకేలా గౌరవిస్తా!

మే 17 ( హంసకలం వార్త )




తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన లేటెస్ట్ కామెంట్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి తెలుగు సినిమా ఇండస్ట్రీతో తన సంబంధాల పై వస్తున్న ప్రచారానికి ఆయన ఓ కార్యక్రమంలో ఆసక్తికరంగా స్పందించారు. ముఖ్యంగా సింగిల్ బీర్ తాగడానికి కూడా తన దగ్గరికి ఒకప్పుడు వచ్చేవారంటూ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్నాయి.కొంతకాలంగా తెలంగాణ ప్రభుత్వం, తెలుగు సినిమా ఇండస్ట్రీ మధ్య దూరం పెరిగిందనే ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా టాలీవుడ్ ప్రముఖులు సీఎం రేవంత్ రెడ్డిని పెద్దగా కలవడం లేదని, అదే సమయంలో బాలీవుడ్ ప్రముఖులు మాత్రం తరచూ భేటీ అవుతున్నారని చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యం లో సీఎం చేసిన వ్యాఖ్యలు మరింత హాట్ టాపిక్ గా మారాయి. తనకు ఇండస్ట్రీ గురించి పూర్తిగా తెలుసని రేవంత్ రెడ్డి అన్నారు. నేను ఇండస్ట్రీని కొత్తగా చూడడం లేదు. నాకు ఎక్కువ వివరాలు తెలుసు. అంతే కాదు నాకు అందరి గురించి తెలుసు. అందుకే నా దగ్గరికి వచ్చి చెప్పలేరు అని వ్యాఖ్యానించారు. ఒక్కసారిగా డబ్బు, హోదా వచ్చిన తర్వాత కొందరిలో మార్పులు వస్తాయని, సెలబ్రిటీలతో కలవాలని, సోషల్ గా ఎదగాలని భావిస్తారని చెప్పారు. దీనినే సోషల్ క్లైంబింగ్ అంటారని ఆయన పేర్కొన్నారు. అప్పటి వరకు మనలో మనం అణిచి వేసుకున్న కొన్ని కోరికలు ఉంటాయని, ఒక్కసారిగా అవి నిద్రలేస్తాయని చెప్పారు. ఇప్పుడు స్టార్లు అంటున్న వాళ్లలో చాలా మంది తనకు 30 సంవత్సరాల క్రితమే తెలుసని చెప్పారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే రోజుల్లో సింగిల్ బీర్ కోసం తన దగ్గరికి వచ్చేవారని, సంతకం పెట్టు అన్న. బీర్ తాగుతామని అనేవారంటూ వ్యాఖ్యానించారు. ఆ ాామెంట్స్ ఎవరిని ఉద్దేశించి అన్నారనే దానిపై సోషల్ మీడియాలో చర్చలు సాగుతున్నాయి. అమెరికా అంబాసిడర్ వచ్చినా, సాఫ్ట్వేర్ సీఈఓ వచ్చినా ఒకేలా గౌరవిస్తా! అలాగే తాను ఎవరి ముందు నటించనని, అందరితో ఒకేలా వ్యవహరిస్తానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అమెరికా అంబాసిడర్ వచ్చినా, ప్రధాని వచ్చినా, సాఫ్ట్వేర్ సీఈఓ వచ్చినా అందరినీ ఒకేలా గౌరవిస్తా. వంగి వంగి దండాలు పెట్టడం నాకు రాదు. అది నా బ్లడ్ లోనే లేదు అని అన్నారు. ఆ వ్యాఖ్యలతో ఆయన తన వ్యక్తిత్వాన్ని క్లియర్ గా చెప్పే ప్రయత్నం చేసినట్లు కనిపిస్తోంది. అయితే రేవంత్ రెడ్డి కామెంట్స్ లో రాజకీయ ధోరణి మాత్రమే కాకుండా, సినీ ప్రముఖులపై కూడా ఒక రకమైన అసంతృప్తి కనిపించిందని కొందరు నెటిజన్లు అంటున్నారు భావిస్తున్నారు. ముఖ్యంగా టాలీవుడ్ తో ప్రభుత్వ సంబంధాలపై గతంలోనూ పలు సందర్భాల్లో చర్చ జరిగింది. సినిమా టికెట్ రేట్లు, బెనిఫిట్ షోలు, పరిశ్రమ సమస్యలు వంటి అంశాల్లో సినీ పెద్దలు ప్రభుత్వంతో దూరంగా ఉంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు సీఎంవ్యాఖ్యలను కొందరు సమర్థిస్తుండగా,మరి కొందరు విమర్శిస్తున్నారు వ్యక్తిగత విషయాలను ప్రస్తావించడం అవసరమా అనే ప్రశ్నలు కూడా వినిపిస్తున్నాయి. అయితే రేవంత్ రెడ్డి మాత్రం తన స్వభావం అలాంటిదేనని, ఎవరి కోసం ప్రత్యేకంగా మారబోనని స్పష్టం చేశారు. మొత్తానికి సీఎం చేసిన కామెంట్స్ ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. మరి టాలీవుడ్ ప్రముఖులు ఆ వ్యాఖ్యలపై ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# పేదల ముంగిట సంక్షేమ పథకాలు

–కార్యకర్తలే ప్రచారకర్తలు కావాల

–ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి



మే 17 ( హంసకలం వార్త )

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి గ్రామస్థాయిలో ఇంటింటా ప్రచారం చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై ఉందని మానకొండూరు ఎమ్మెల్యే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం మానకొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ మండల నూతన అధ్యక్షుడు ద్యావ శ్రీనివాసరెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పెంచాల కిషన్ రావుల అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ హయాంలో ధనికులకు మాత్రమే మేలు జరగగా, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో నిరుపేదలు, మధ్యతరగతి వారు మాత్రమే లబ్ధి పొందుతున్నారని చెప్పారు. వివిధ వర్గాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై ఉందని, ఈ విషయంలో కార్యకర్తలే ప్రసారకర్తలుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోవడం వల్ల రాష్ట్ర ఆర్థిక స్థితి అధ్వాన్నంగా మారిందని, అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. ఆరు గ్యారెంటీ పథకాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేస్తుందని ఆయన చెప్పారు. త్వరలో కొత్త పెన్షన్లు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నదని చెప్పారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి కృషి వల్లనే మానకొండూరు మండలంలో కాంగ్రెస్ పార్టీని బలమైన శక్తిగా ఎదిగిందని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. పార్టీ అప్పగించిన పనిన కష్టమైనా దాన్ని రవీంద్ర చారి ఇష్టంగా చేసే వారన్నారు. కార్యకర్తలు స్ఫూర్తిని నింపుతూ పార్టీని విజయతీరాలకు చేర్చడంలో ఆయన సక్సెస్ అయ్యారని ఎమ్మెల్యే కొనియాడారు. కార్యకర్తల కష్టంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రా గలిగిందని, అలాంటి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణుల పైననే ఉందని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా రవీంద్ర చారికి భవిష్యత్తులో మంచి అవకాశాలు త్వరలో లభిస్తాయని ఆయన చెప్పారు. రవీంద్ర చారికి ఇచ్చిన మాదిరిగానే నూతన మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డికి కూడా సహకారం, తోడ్పాటు అందించాలని ఎమ్మెల్యే కోరారు. నూతన అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తనకు అప్పగించిన పదవిని బాధ్యతతో నిర్వహిస్తానని చెప్పారు. పార్టీ కుటుంబం లాంటిదని ప్రతి కుటుంబంలోనూ ఏవో చిన్నపాటి సమస్యలు ఉండడం పరిపాటేనని ఆయన పేర్కొన్నారు. పార్టీలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని శ్రీనివాసరెడ్డి చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో మానకొండూరు మండలంలో 11వేల మెజార్టీ రావడం నందగిరి రవీంద్ర చారి కృషివల్లే సాధ్యపడిందని ఆయన పేర్కొన్నారు. నందగిరి మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి పార్టీ నాయకులు కార్యకర్తలు సమితిగా కృషి చేయడం వల్లనే మండలంలో 16 మంది సర్పంచులను గెలిపించుకో గలిగామని చెప్పారు. కాబోయే ఎంపీపీ జడ్పిటిసి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించాలని కోరారు. సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు పెంచాల కిషన్ రావు మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు ఫోరం పక్షాన కృషి చేస్తానని చెప్పారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మధు, తదితరులు హాజరయ్యారు. సమావేశానికి ముందు మానకొండూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

## జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు

–డిఆర్డిఓ శ్రీరామ్


–జాబ్ కార్డు కలిగి ఈ కేవైసీ నమోదు చేసుకున్న వారికి అవకాశం..

మే 17 ( హంసకలం వార్త )

జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించే అవకాశం ఉన్నందున, జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నందు జాబ్ కార్డు కలిగి ఈ కేవైసీ ప్రక్రియ నమోదు చేసుకున్న వారికి పనులు కల్పిస్తున్నట్లు ఇట్టి అవకాశాన్ని రైతులు, కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కే.శ్రీరామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 63 వేల మంది కూలీలు పనులకు హాజరవుతున్నారని, మే 16న పెండింగ్ లో ఉన్న కూలీల వేతనాలు 16.76 కోట్లు విడుదల అయినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తూ ఉద్యానవన పంటల సాగు క్రింద మామిడి, జామ, డ్రాగన్ ఫ్రూట్, వెదురు, జీడిమామిడి, మునగ, కొబ్బరి, శీతాకాలం వంటి తోటల పెంపకానికి ప్రోత్సహించి రైతులకు శాశ్వత ఆదాయ వనరులను కల్పించడం జరుగుతుందని, 5 ఎకరాల లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులనీ, జాబ్ కార్డు కలిగిన ప్రతి రైతు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి మండల కార్యాలయంలోని ప్రోగ్రాం అధికారి, అదనపు ప్రోగ్రామ్ అధికారిని సంప్రదించాలని డిఆర్డిఓ కే.శ్రీ రామ్ ఆ ప్రకటనలో తెలిపారు.


# బిజినెస్

## మళ్లీ నష్టాల్లోకి మార్కెట్లు



వరుసగా రెండు రోజులు లాభాల బాటలో సాగిన దేశీయ ప్రామాణిక ఈక్విటీ సూచీలు శుక్రవారం మళ్లీ నష్టాలతో ముగిశాయి. మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎసయూ బ్యాంకుల షేర్లలో అమ్మకాలతో పాటు ముడి చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో ఇన్వెస్టర్ల అప్రమత్తత స్టాక్ మార్కెట్లు నష్టాలతో ముగియడానికి కారణమయ్యాయి. బీఎసఈ సెన్సెక్స్ లాభనష్టాల మధ్య ఊగిసలాడి 160.73 పాయింట్ల నష్టంతో 75,237.99 వద్ద ముగిసింది. ప్రారంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ దాదాపు 470 పాయింట్ల మేర దూసుకుపోయింది. ఇక ఎన్ఎసఈ నిఫ్టీ 46.10 పాయింట్ల నష్టంతో 23,643.50 వద్ద ముగిసింది. బంగారం రూ.3,200..వెండి రూ.21,600 తగ్గాయ్..: బంగారం, వెండి ధరలు దిగొచ్చాయి. ఢిల్లీ మార్కెట్లో శుక్రవారం 10 గ్రాముల బంగారం (99.9 శాతం స్వచ్ఛత) ధర రూ.3,200 తగ్గి రూ.1,62,800కు చేరుకోగా.. కిలో వెండి ధర రూ.21,600 తగ్గి రూ.2.75 లక్షలకు చేరుకున్నట్టు అఖిల భారత సరాఫా అసోసియేషన్ పేర్కొంది. డాలర్ బలపడటం, ఇన్వెస్టర్లు భారీగా లాభాల స్వీకరణకు దిగడంతో ఈ రెండు లోహాల ధరలు దిగివచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) స్పాట్ గోల్డ్ ధర 104 డాలర్లకు పైగా తగ్గి 4,548.46 డాలర్లు, ఔన్స్ వెండి ధర 5.26 డాలర్లు తగ్గి 78.21 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

# ప్రపంచంలో అతిపెద్ద ఏఐ టెక్ కంపెనీగా టీసీఎస్




ప్రపంచంలో అతిపెద్ద ఏఐ ఆధారిత టెక్నాలజీ సేవల కంపెనీగా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు టీసీఎస్ సీఈఓ, ఎండీ కే కృతివాసన్ తెలిపారు. తమ టాప్ 139 క్లయింట్లలో ఇప్పటికే 130 మంది తమ ఏఐ సేవల భాగస్వామిగా టీసీఎస్‌ను ఎంచుకున్నారని 2025-26 ఆర్థిక సంవత్సర నివేదికలో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరాన్ని (2025-26) ఎంటర్‌ప్రైస్ ఏఐ సేవల పరివర్తన కాలంగా ఆయన అభివర్ణించారు. ఈ సాంకేతిక మార్పుకు అనుగుణంగా తమ సిబ్బందికి ఏఐ వంటి ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ అందిస్తున్నామన్నారు. ఇప్పుడు సంస్థలో 2.70 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఏఐ నైపుణ్యాలను కలిగి ఉన్నారని అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఏఐ నైపుణ్యం కలిగిన సిబ్బంది మూడింతలయ్యారని వార్షిక నివేదికలో కృతివాసన్ ప్రస్తావించారు.

**మేధో మౌలిక వసతిగా ఏఐ: చంద్రశేఖరన్**

కృత్రిమ మేధ(ఏఐ) కేవలం సాంకేతిక కాదని ప్రపంచవ్యాప్తంగా సంస్థలకు మేధో మౌలిక వసతిగా మారుతోందని దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అన్నారు. టీసీఎస్ 'హ్యూమన్ ప్లస్ ఏఐ' ఆపరేటింగ్ మోడల్‌ను విస్తరిస్తున్నదని, ఏఐ సేవల ద్వారా 230 కోట్ల డాలర్లు.. క్లౌడ్, డేటా, సైబర్ సెక్యూరిటీ వంటి ఆధునిక సేవల ద్వారా 1,150 కోట్ల డాలర్ల వార్షిక ఆదాయాన్ని సాధించిందని కంపెనీ 2025-26 ఆర్థిక సంవత్సర నివేదిక ద్వారా వాటాదారులకు తెలిపారు. సంస్థల పెట్టుబడులు, సరఫరా వ్యవస్థ నిర్వహణ, రిస్క్ మేనేజ్‌మెంట్, సంబంధిత వర్గాలకు సేవలందించే తీరును ఏఐ సమూలంగా ప్రభావితం చేయనుందన్నారు. ఈ నేపథ్యంలో కంపెనీ అత్యంత భద్రమైన, చురుకైన, చట్టబద్ధమైన ఏఐ మౌలిక వసతిని ఏర్పాటు చేయాలనుకుంటోందన్నారు. ఏజెంటిక్ ఏఐ పరిష్కారాలందించే ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇండస్ట్రీల అవసరాలకు అనుగుణమైన ఏఐ ఆపరేటింగ్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయనున్నట్లు చంద్రశేఖరన్ తెలిపారు. కృతివాసన్‌కు రూ.28 కోట్ల పారితోషికం: టీసీఎస్ సారథిగా కృతివాసన్ గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.28 కోట్ల పారితోషికం అందుకున్నారు. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2024-25) తో పోలిస్తే ఆయన ప్యాకేజీ 6.3 శాతం పెరిగింది. టీసీఎస్ చైర్మన్‌గా చంద్రశేఖరన్ మాత్రం కంపెనీ నుంచి ఎలాంటి కమీషన్ తీసుకోలేదు. పూర్తి ఏడాది కాలానికి సిట్టింగ్ ఫీజు కింద ఆయనకు కేవలం రూ.4.2 లక్షలు లభించాయి.

**ఏఎస్ఎంఎల్‌తో టాటా ఎలక్ట్రానిక్స్ జట్టు**

భారత్‌లో సెమీకండక్టర్ల (చిప్) తయారీ కోసం టాటా ఎలక్ట్రానిక్స్ నెదర్లాండ్స్‌కు చెందిన చిప్ యంత్రాల దిగ్గజం ఏఎస్ఎంఎల్‌తో చేతులు కలిపింది. ప్రధాని మోదీ నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా ఈ భాగస్వామ్యం కుదిరింది. ఇందులో భాగంగా గుజరాత్‌లోని ధోలెరాలో టాటా ఎలక్ట్రానిక్స్ చిప్ తయారీ యూనిట్ ఏర్పాటుకు ఏఎస్ఎంఎల్ సహకరించనుంది.

# నవ లిమిటెడ్ లాభంలో 55 శాతం క్షీణత



గడచిన ఆర్థిక సంవత్సరం (2025-26) మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో నవ లిమిటెడ్.. రూ.1,194.80 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.136.30 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2024-25) ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 13.2 శాతం (రూ.1,055.80 కోట్లు) వృద్ధి చెందగా లాభం 55 శాతం (రూ.302.80 కోట్లు) క్షీణించింది. స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన మాత్రం రూ.614.30 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.478.10 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఏడాది ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 16.3 శాతం, లాభం ఏకంగా 392.3 శాతం వృద్ధి చెందింది. పటిష్ఠమైన నిర్వహణా సామర్థ్యం, డివిడెండ్, షేర్ బైబ్యాక్ ద్వారా నగదు రావటంతో స్టాండ్‌ఎలోన్ ఆదాయం, లాభం గణనీయంగా పెరిగిందని నవ లిమిటెడ్ పేర్కొంది. కాగా రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.5.50 (550) తుది డివిడెండ్‌ను కంపెనీ ప్రకటించింది.

# ఇందన పొదుపు: ప్రేక్షకుల్లేకుండా ఐపీఎల్ నిర్వహిస్తారా కేంద్రానికి సీటీఐ ప్రతిపాదనలు



ప్రస్తుతం సాగుతున్న ఐపీఎల్ 2026 సీజన్‌ను పునర్వ్యవస్థీకరించాలని 'ఛాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ (సీటీఐ) కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖను కోరింది. ఇంధన ఆదా కోసం మిగిలిన మ్యాచ్‌లను ప్రేక్షకుల్లేకుండా కొన్ని పరిమిత వేదికల్లోనే నిర్వహించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీటీఐ చైర్మన్ బ్రిజేష్ గోయల్ కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు లేఖ రాశారు. ఇటీవల దేశీయంగా లీటరు ఇంధనంపై 3 రూపాయల మేర పెరిగిన నేపథ్యంలో ఈ టోర్నమెంట్ వల్ల పర్యావరణం, ఇంధన నిల్వలపై ప్రభావం పడుతోందని సీటీఐ తన లేఖలో ప్రస్తావించింది. ఐపీఎల్ జట్లు నిరంతరం ఒక నగరం నుంచి మరో నగరానికి ప్రయాణించడం వల్ల ఇంధన నిల్వలు భారీగా ఖర్చవుతున్నాయని సీటీఐ ఆందోళన వ్యక్తం చేసింది. ఐపీఎల్ ఫ్రాంచైజీలు ఉపయోగించే బోయింగ్ 737, ఎయిర్‌బస్ ఏ320 చార్టర్డ్ విమానాలు గంటకు 2,400 నుంచి 3,000 లీటర్ల ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌ను వినియోగిస్తాయని గుర్తు చేసింది. ఒక్కో జట్టు ఈ సీజన్‌లో దాదాపు 10 విమాన ప్రయాణాలు చేస్తుందని, దీనివల్ల ఒక్కో ఫ్రాంచైజీ 50 వేల నుంచి 70 వేల లీటర్ల ఇంధనాన్ని వినియోగిస్తోందని బ్రిజేష్ గోయల్ లెక్కలతో వివరించారు. పైగా ఒక్కో మ్యాచ్‌ను చూడటానికి దాదాపు 50 వేల మంది వరకు ప్రేక్షకులు స్టేడియాలకు వస్తుంటారని గుర్తు చేశారు. వీళ్లు వాడే వాహనాల వల్ల రోజూ వేల లీటర్ల పెట్రోల్, డీజిల్ వృథా అవుతోందని తెలిపారు. గతంలో కరోనా మహమ్మారి సమయంలో బయో-బబుల్ విధానంలో పరిమిత వేదికల్లో ఐపీఎల్‌ను విజయవంతంగా నిర్వహించిన విషయాన్ని సీటీఐ గుర్తు చేసింది.

## వెంకటేష్ అయ్యర్ ఫైర్, కోహ్లీ ఫిఫ్టీ... ఆర్సీబీ భారీ స్కోరు... పంజాబ్ కు పెను సవాల్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ, నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 222 పరుగుల భారీ స్కోరు సాధించింది. వెంకటేశ్ అయ్యర్ (73 నాటౌట్), విరాట్ కోహ్లీ (58) అద్భుత హాఫ్ సెంచరీలతో చెలరేగారు. ధర్మశాల వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన పంజాబ్ కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. అయితే, ఆ జట్టు బౌలర్ల ప్రణాళికలను ఆర్సీబీ బ్యాటర్లు పూర్తిగా చిత్తుచేశారు. ఓపెనర్ జాకబ్ బెతెల్ (11) త్వరగానే ఔటైనా, ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు పంజాబ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. విరాట్ కోహ్లీ తన ఫామ్‌ను కొనసాగిస్తూ 37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 58 పరుగులు చేశాడు. మరోవైపు దేవదత్ పడిక్కల్ (45), కేవలం 25 బంతుల్లోనే మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కోహ్లీ, పడిక్కల్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన వెంకటేష్ అయ్యర్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 40 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్లతో 73 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. చివర్లో టిమ్ డేవిడ్ (12 బంతుల్లో 28) కూడా తన వంతుగా మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీ స్కోరు 220 మార్కును దాటింది. అర్ధ సెంచరీ పూర్తయ్యాక వెంకటేష్ అయ్యర్.. దళపతి విజయ్ (ప్రస్తుతం తమిళనాడు సీఎం) తరహాలో రెండు చేతులు క్రాస్ చేస్తూ సెలబ్రేట్ చేసుకోవడం విశేషం. పంజాబ్ బౌలర్లలో ఒక్క హర్‌ప్రీత్ బ్రార్ మాత్రమే ఆకట్టుకున్నాడు. అతను 4 ఓవర్లలో 35 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. మిగతా బౌలర్లందరూ భారీగా పరుగులు సమర్పించుకున్నారు. అర్షదీప్ సింగ్, యుజ్వేంద్ర చాహల్ చెరో వికెట్ తీసినప్పటికీ, పరుగులను నియంత్రించడంలో విఫలమయ్యారు. ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించడానికి పంజాబ్ బ్యాటర్లు అసాధారణ ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. ఈ మ్యాచ్ లో గెలుపు పంజాబ్ కు చాలా అవసరం. ప్లే ఆఫ్ సమీకరణాలు అత్యంత సంక్లిష్టంగా మారిన తరుణంలో ఇక ప్రతి మ్యాచ్ లోనూ గెలుపు తప్పనిసరి. నేటి మ్యాచ్ లో ఆర్సీబీ గనుక గెలిస్తే, ఆ జట్టు ప్లే ఆఫ్ దశలోకి దూసుకెళ్లే అవకాశం ఉంది.

# స్పోర్ట్స్

## అఫ్గాన్ స్టార్ ప్లేయర్ రహ్మత్ షా చనిపోయాడా? సోషల్ మీడియాలో వార్త వైరల్




అఫ్గానిస్థాన్ స్టార్ క్రికెటర్ రహ్మత్ షా చనిపోయినట్లు సోషల్ మీడియాలో ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. 32 ఏళ్ల రహ్మత్ షా మరణించాడంటూ 'ఎక్స్' వేదికగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఆయన పూర్తిగా క్షేమంగా ఉన్నట్లు తేలింది. అఫ్గాన్ ఆల్‌రౌండర్ కరీమ్ జనత్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన ఒక పోస్ట్ వల్ల ఈ గందరగోళం మొదలైంది. రహ్మత్ షా తల్లి మరణించడంతో ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కరీమ్ జనత్ పష్తో భాషలో పోస్ట్ పెట్టారు. ఆ పోస్టుకు రహ్మత్ షా ఫొటోను జత చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఉన్న ఆటోమేటిక్ ట్రాన్స్‌లేషన్ ఫీచర్ ఆ పష్తో సందేశాన్ని ఇంగ్లీషులోకి తప్పుగా అనువదించింది. రహ్మత్ షా తల్లి చనిపోయారనే విషయాన్ని మార్చేసి,రహ్మత్ షానే చనిపోయాడంటూ తప్పుడు అర్థం వచ్చేలా చూపించింది. దీంతో అభిమానులు కంగారుపడి ఆ వార్తను వైరల్ చేశారు. రహ్మత్ షా గత ఏడాది అక్టోబర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో అఫ్గానిస్థాన్ తరఫున చివరిసారిగా ఆడాడు. ఆ సిరీస్‌లో గాయం కారణంగా అతడు చివరి మ్యాచ్‌కు దూరమయ్యాడు. ప్రస్తుతానికి ఆరోగ్యంగానే ఉన్నాడు. కేవలం ఇన్‌స్టాగ్రామ్ యాప్ చేసిన తప్పు అనువాదం వల్లే ఈ ఫేక్ న్యూస్ ప్రచారంలోకి వచ్చింది.

# చిరంజీవితో ఊటీలో డ్యాన్స్...

## పాత జ్ఞాపకాలను పంచుకున్న మీనాక్షి శేషాద్రి



ఒకప్పటి బాలీవుడ్ ప్రముఖ నటి మీనాక్షి శేషాద్రి, మెగాస్టార్ చిరంజీవితో తనకున్న పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. సుమారు 3 దశాబ్దాల క్రితం చిరంజీవితో కలిసి 'ఆజ్ కా గూండా రాజ్' సినిమా కోసం ఊటీలో చిత్రీకరించిన 'లప్కరా' పాట రోజులను గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ చేశారు. ఆ పాటకు మరోసారి స్టెప్పులేస్తూ ఒక వీడియోను అభిమానులతో పంచుకున్నారు. శుక్రవారం రాత్రి పోస్ట్ చేసిన ఈ వీడియోలో, మీనాక్షి నలుపు రంగు దుస్తుల్లో ఎంతో గ్రేస్‌ఫుల్‌గా డాన్స్ చేస్తూ కనిపించారు. ఈ సందర్భంగా ఆమె చిరంజీవిని ప్రశంసించారు. "చిరంజీవి ఒక గొప్ప నృత్యకారుడు. ఆయనతో కలిసి పనిచేయడం నాకు చాలా ఆనందాన్నిచ్చింది. అందుకే ఆ చిత్రంలో మేమిద్దరం కలిసి చాలా డాన్స్ నంబర్లు చేశాం. 'లప్కరా' పాటను ఊటీలోని అందమైన లొకేషన్లలో చిత్రీకరించాం" అని తన పోస్ట్‌లో పేర్కొన్నారు. రవిరాజా పినిశెట్టి దర్శకత్వంలో 1992లో వచ్చిన హిందీ యాక్షన్ చిత్రం 'ఆజ్ కా గూండా రాజ్'. ఇందులో చిరంజీవి, మీనాక్షి శేషాద్రి జంటగా నటించారు. అవినీతి, అన్యాయాల పై ఓ సామాన్యుడు చేసే పోరాటమే ఈ చిత్ర కథ. ఈ సినిమాలోని 'లప్కరా' పాట అప్పట్లో పెద్ద హిట్ అయింది.

## తమిళ దర్శకుడు వేధించాడు.. నాపై కేసు పెట్టారు:

# లావణ్య త్రిపాఠి సంచలన వ్యాఖ్యలు



ప్రముఖ నటి, కొణిదెల వారి కోడలు లావణ్య త్రిపాఠి తన కెరీర్‌లో ఎదురైన ఓ చేదు అనుభవాన్ని, వ్యక్తిగత జీవిత విశేషాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత 'సతీ లీలావతి' చిత్రంతో తిరిగి ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆమె, తాజాగా ఓ ఇంటర్వ్యూలో పలు సంచలన విషయాలు వెల్లడించారు. చిత్ర పరిశ్రమలో తాను కూడా వేధింపులు ఎదుర్కొన్నానని ఆమె తెలిపారు. కెరీర్ ఆరంభంలో ఓ తమిళ దర్శకుడు తనతో అసభ్యంగా ప్రవర్తించాడనీ దాంతో ఆ సినిమానే వదులుకున్నానని, దీనిపై చిత్రబృందం తన మీద కేసు పెట్టిందన్నారు. అంతటితో ఆగకుండా మీడియాలోనూ తప్పుడు కథనాలు రాయించారని, ఆ ఘటనతో మానసికంగా తాను కుంగిపోయానని తెలిపింది. అలాగే, బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'గీత గోవిందం' చిత్రంలో హీరోయిన్‌గా తొలి అవకాశం తనకే వచ్చిందని, అయితే ఆ సమయంలో వేరే సినిమాలతో బిజీగా ఉండటం వల్ల ఆ ఆఫర్‌ను వదులుకోవాల్సి వచ్చిందని లావణ్య వెల్లడించారు. ఇక వరుణ్ తేజ్‌తో తన ప్రేమ, వైవాహిక జీవితం గురించి మాట్లాడుతూ, "ఒక సినిమా వేడుకలో వరుణ్ కళ్లను చూసి ప్రేమలో పడ్డాను. ఆయన చాలా సపోర్టివ్‌గా ఉంటారు. మా మధ్య గొడవ వస్తే తను వాదిస్తాడు, నేను మౌనంగా ఉండిపోతాను. వరుణ్ లాంటి భర్త దొరకడం, మెగా కుటుంబంలోకి రావడం నా అదృష్టం" అని లావణ్య త్రిపాఠి తెలిపారు.

## విజయ్ నాకు సమవుజ్జీ కాదు..

## రజినీకాంత్ సంచలన వ్యాఖ్యలు



తమిళనాడు ప్రజలు మార్పు కోరుకున్నారని.. అందుకే విజయ్ గెలిచారని స్టార్ హీరో రజినీకాంత్ అన్నారు. తనకు రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేదన్నారు. తానే గనక పార్టీ పెడితే కచ్చితంగా గెలిచేవాడినన్నారు. డీఎంకే అధినేత స్టాలిన్ తనకు మంచి స్నేహితుడని తెలిపారు. అందుకే ఆయన్ని కలిసినట్లు వెల్లడించారు. ఎన్నికల ఫలితాల అనంతరం స్టాలిన్‌ను కలిసిన నేపథ్యంలో రజినీపై విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఆదివారం చెన్నైలోని తన నివాసంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. మరోవైపు విజయ్ సీఎంగా గెలవకూడదని తాను ఎలాంటి ప్రయత్నం చేయలేదని రజినీకాంత్ చెప్పారు. విజయ్‌ను తనకు సమవుజ్జీగా భావించడం లేదన్నారు. తమ వయసులో 28 ఏళ్ల వ్యత్యాసం ఉందన్నారు. కమల్ హాసన్ సీఎం అయితే అసూయ పడతాను గానీ, విజయ్ విషయంలో అలాంటిదేమీ లేదన్నారు. రెండు ప్రధాన పార్టీలను ఢీకొని గెలిచిన విజయ్‌కు తాను శుభాకాంక్షలు తెలిపానని గుర్తుచేశారు. ఇటీవల ఎయిర్‌పోర్టులో ఓ వ్యక్తి విజయ్ గురించి ప్రస్తావించగా రజినీకాంత్ నవ్వుతూ వెళ్లిపోయిన విషయం తెలిసిందే. దీనిపై విమర్శలు రావడాన్నీ రజినీ తాజాగా ప్రస్తావించారు. ఎవరో వ్యక్తి ఫోన్‌లో రికార్డు చేస్తూ అడిగిన ప్రశ్నకు తాను స్పందించలేదన్నారు. తాను అనవసరంగా ఇతర విషయాల గురించి మాట్లాడే వ్యక్తిని కాదన్నారు.

# రేపటి నుంచే 'పెద్ది' పోరాటం...

# ముంబైలో ట్రైలర్ టేకోవర్ కు అంతా రెడీ!

- రేపు ముంబైలో 'పెద్ది' ట్రైలర్ విడుదల
- రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా బుచ్చిబాబు దర్శకత్వం
- జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా సినిమా రిలీజ్
- ట్రైలర్‌కు ముందు జగపతి బాబు క్యారెక్టర్ గ్లింప్స్ విడుదల
- ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్న పాన్-ఇండియా చిత్రం



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న భారీ చిత్రం 'పెద్ది'. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ రేపటి నుంచి ఫుల్ స్పీడ్ లో కొనసాగనున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను మే 18న ముంబైలో ఒక గ్రాండ్ ఈవెంట్ లో విడుదల చేసేందుకు సర్వం సిద్ధమైంది. "అతడి పోరాటం రేపటి నుంచి మొదలు" అనే క్యాప్షన్‌తో పెద్ది టీమ్ ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. "పెద్ది ట్రైలర్ టేకోవర్" పేరుతో ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్‌లో మే 18న మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ ఈవెంట్ జరగనుంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను అభిమానులు, మీడియా సమక్షంలో విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ఈ చిత్రంలో రామ్ చరణ్‌కు జోడీగా జాన్వీ కపూర్ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా, విజయనగరం నేపథ్యంలో సాగే ఒక గ్రామీణ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, జగపతి బాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ట్రైలర్ విడుదలకు ముందు ప్రమోషన్స్‌ను వేగవంతం చేసిన మేకర్స్, మే 17న నటుడు జగపతి బాబు పాత్రకు సంబంధించిన ప్రత్యేక గ్లింప్స్‌ను విడుదల చేసి క్యూరియాసిటీని పెంచారు. ఇప్పటికే విడుదలైన 'చికిరి చికిరి', 'రై రై రా రా' పాటలు సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తుండగా, ఓవర్సీస్‌లో ప్రీ-సేల్స్ కూడా భారీ స్థాయిలో జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని జూన్ 4న తెలుగు, హిందీ, తమిళం సహా పలు భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# నడిరోడ్డు పై పావలా శ్యామల.. అండగా నిలిచిన నిర్మాత దిల్ రాజు

తీవ్ర అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతూ నడిరోడ్డుపై నిస్సహాయ స్థితిలో కనిపించిన సీనియర్ నటి పావలా శ్యామలను ఆదుకునేందుకు ప్రముఖ నిర్మాత దిల్ రాజు ముందుకు వచ్చారు. ఆమె దయనీయ పరిస్థితి గురించి సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న ఆయన తక్షణమే స్పందించి ఆమె పూర్తి వైద్య బాధ్యతలను స్వీకరిస్తున్నట్లు ప్రకటించారు. ఒకప్పుడు తన నటనతో తెలుగు ప్రేక్షకులను అలరించిన పావలా శ్యామల ప్రస్తుతం వృద్ధాప్యం, అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత రాత్రి చికిత్స కోసం కూకట్‌పల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా డబ్బు లేదనే కారణంతో యాజమాన్యం చేర్చుకోవడానికి నిరాకరించింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న శ్యామల, ఆమె కుమార్తెను క్యాబ్ డ్రైవర్ నడిరోడ్డుపై వదిలేసి వెళ్లిపోయాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆర్కే ఫౌండేషన్ సహాయంతో ఆమెను ఆదుకున్నారు. పావలా శ్యామల దీనస్థితికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం దిల్ రాజు దృష్టికి వెళ్లింది. వెంటనే చలించిపోయిన ఆయన, తన బృందాన్ని అప్రమత్తం చేశారు. పావలా శ్యామల ప్రస్తుతం కూకట్‌పల్లిలోని ప్రసాద్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారని తెలుసుకుని, స్వయంగా ఆసుపత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల వివరాల ప్రకారం పావలా శ్యామల పిత్తాశయం (గాల్‌బ్లాడర్) సమస్యతో పాటు, అధిక క్రియాటినిన్ స్థాయిలు, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఆమెకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. "శ్యామలకు అత్యుత్తమ వైద్యం అందించండి. ఖర్చుల గురించి ఆందోళన అవసరం లేదు. పూర్తి బాధ్యత నేను తీసుకుంటాను. నా మేనేజర్లు మీతో టచ్‌లో ఉంటారు" అని దిల్ రాజు వైద్యులకు భరోసా ఇచ్చారు. దిల్ రాజు బృందం ఆసుపత్రికి వెళ్లి శ్యామలను పరామర్శించగా ఆమె భావోద్వేగానికి గురయ్యారు. తనకు అండగా నిలిచిన దిల్ రాజుకు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు. "దిల్ రాజు మాకు దేవుడితో సమానం. ఆయన కచ్చితంగా సహాయం చేస్తారని అమ్మ ఎన్నోసార్లు చెప్పింది. ఆ నమ్మకమే నిజమైంది" అని పావలా శ్యామల కుమార్తె అన్నారు. కష్టకాలంలో ఉన్న ఒక సీనియర్ కళాకారిణిని ఆదుకోవడానికి దిల్ రాజు చూపిన చొరవ పట్ల సినీ వర్గాలు, నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.





Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449